Follow: @ANNTELUGU
27-08-2026
ANN తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 29న మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెల్లడి.. ఏర్పాట్లు పరిశీలన

**అశ్వాపురం, మహా :** అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ఈనెల 29న రాష్ట్రమంత్రుల చేతులమీదుగా ప్రారంభమవుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులో భాంగా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు పనులను వేగవంతం చేస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని,

మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**



### నేపాల్‌లో వరద బీభత్సం

- వెయ్యి మందికిపైగా గల్లంతు!
- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు.
- సహాయక చర్యలకు 15 హెలికాప్టర్లు

03




### ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల షాక్

- చలాన్లు కట్టకపోతే ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్
- హైదరాబాద్ పోలీసుల బిగ్ ప్లాన్!

02



### భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్ తయారీకి కేంద్రం చర్యలు

స్థానిక విడిభాగాల సరఫరా వ్యవస్థపై కేంద్రం దృష్టి

02

# కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు?

## ఎథిక్స్ కమిటీ భేటీపై ఉత్కంఠ



- 29న కౌశిక్ వ్యవహారంపై చర్చించేందుకు కీలక సమావేశం
- కడియంను తుపాకితో కాల్చేస్తామని సైగలు చేశారని మండిపడ్డ అధికారపక్షం



**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసనసభ నైతికత (ఎథిక్స్) కమిటీ కీలక సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్‌లో జరగనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , కడియం శ్రీహరిపై చేసిన అనైతిక ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై ఈ భేటీలో కమిటీ విచారణ జరపనుంది. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కడియం శ్రీహరిపై పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరుపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సమగ్ర విచారణ కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నైతికత కమిటీకి సమీక్షకు పంపించారు. ఈ మేరకు విచారణను వేగవంతం చేస్తూ, శాసనసభ కార్యదర్శి తిరుపతి ఈ సమావేశానికి సంబంధించి



### రవితేజ 'ఇరుముడి' కోసం థియేటర్ ముందు ధర్నా

- సినిమా ఆపేశారని మక్తల్‌లో ఫ్యాన్స్ ఆందోళన

**మక్తల్, మహా :** సినిమా చూడటానికి థియేటర్‌కు వెళ్లడం కామన్.. కానీ సినిమా వేయలేదని అదే థియేటర్ ముందు ధర్నాకు దిగడం మాత్రం వెరీ వెరీ రేర్. నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఇప్పుడు ఇదే సీన్ కనిపించింది. వెంకటరమణ థియేటర్ ముందు బుధవారం ఉదయం ఒక్కసారిగా ప్రేక్షకులు, అయ్యప్ప భక్తులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన సినీ ప్రియులు బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత ఐదు రోజులుగా ఈ థియేటర్‌లో రవితేజ నటించిన 'ఇరుముడి' హౌస్‌ఫుల్ షోలతో దూసుకెళ్తోంది. టికెట్ల కోసం జనం

మిగతా 2వ పేజీలో



### టాక్సిక్.. టార్చర్

- సినిమాపై ప్రేక్షకుల పెదవిరుపు
- దిల్ రాజుకు మరో షాక్

**హైదరాబాద్, మహా :** టాక్సిక్ ప్రేక్షకులకు టార్చర్ గా మారగా, ఇది చూసిన వారికే కాకుండా భారీ సినిమా అని ఫ్యాన్సీరేటకు కొన్న దిల్ రాజుకు కూడా అదే ఫీలింగ్ మిగిల్చింది. యశ్ 'కేజీఎఫ్' తర్వాత ద్విపాత్రాభినయం చేస్తూ, నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన 'టాక్సిక్'పై భారీ

మిగతా 2వ పేజీలో



# ఖర్గేతో భట్టి భేటీ

- క్రమశిక్షణాకమిటీ నివేదికపై 40 నిమిషాల పాటు చర్చలు
- ఖర్గే పిలుపుతో హుటాహుటిన బెంగళూరుకు భట్టి
- ఉదయమే భట్టిని కలిసిన రాజగోపాల్ రెడ్డి, కొండా మురళి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మంత్రి కొండా సురేఖ , ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి ఇచ్చిన నివేదిక ఏఐసీసీ కి చేరిన నేపథ్యంలో తర్వాత పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హుటాహుటిన బుధవారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 40 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి, సస్పెన్షన్ వేటు వేయాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఖర్గే పిలుపుతోనే భట్టి బెంగళూరు వెళ్ళినట్లు తెలుస్తోంది. లక్ష్మణ రేఖ దాటిన నేతలపై ఏఐసీసీ కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనే అంశంపై అధిష్ఠానం మరికొన్ని గంటల్లోనే అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.

**కొండా రాయబారం**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను బుధవారం మధ్యాహ్నం కొండా సురేఖ భర్త కొండా మురళీతో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలిశారు. వివాదాన్ని సర్దుమణిగేలా చూసి, పార్టీ కఠిన నిర్ణయాలు తీసుకోకుండా ఉండేందుకు భట్టి సమక్షంలో చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. ఈ భేటీ జరిగిన కొన్ని గంటల్లోనే డిప్యూటీ సీఎం ఉన్నట్లుండి బెంగళూరుకు పయనం కావడంపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. నేతల భేటీ సారం చెప్పేందుకు వెళ్ళారా? ముందే ఖర్గేను కలవబోతున్నారని తెలిసే ఇద్దరు నేతలు భట్టిని కలిశారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా ఏఐసీసీకి అందిన నివేదిక భట్టి అభిప్రాయం తర్వాత తుది ప్రకటన ఏఐసీసీ నుండి వచ్చే అవకాశాలున్నాయి.

### సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

- కాంగ్రెస్‌లోనే కొనసాగుతా.
- భట్టి విక్రమార్కతో ఎలాంటి చర్చ జరగలేదు
- కొండా మురళి

03



### ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ 2.0

02



### కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
- అక్కడికక్కడే ఆరుగురు మృతి మరో 20 మందికి గాయాలు

03




### అఖిల పావనికి నారా లోకేష్ అభినందనలు

- రాయలసీమ జెన్ స్టార్స్ కు ఎంపికైన మంగళగిరి క్రికెటర్

**మంగళగిరి, మహా :** ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌కు రంగం సిద్ధమవుతున్న వేళ, మంగళగిరికి చెందిన యువ క్రికెటర్ వాసవి అఖిల పావని 'రాయలసీమ జెన్ స్టార్స్' జట్టుకు ఎంపిక కావడం పట్ల రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. ఏపీఎల్ ఉమెన్ క్రికెట్ లీగ్ ఆటగాళ్ల వేలంలో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావనిని రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు దక్కించుకుంది. స్థానిక ప్రాంతానికి చెందిన యువతి రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లో అవకాశం దక్కించుకోవడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

### 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం

- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లలో పోటీల నిర్వహణ
- దేశం నలుమూలల నుంచి పాల్గొననున్న 6వేలకు పైగా క్రీడాకారులు
- యువ క్రీడాకారులతో వర్చువల్‌గా మాట్లాడనున్న ప్రధాని నరేంద్రమోదీ

03








## రవితేజ 'ఇరుముడి' కోసం థియేటర్ ముందు ధర్నా

( మొదటి పేజీ తరువాయి )

భారీగా క్యూ కడుతున్నారు. కొందరికి టికెట్లు దొరకక వెనుదిరగాల్సి వస్తోందట. మంగళవారం రాత్రి కూడా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చినా టికెట్లు దొరకలేదని చెబుతున్నారు. కనీసం బుధవారం అయినా సినిమా చూద్దాం అని ఆశగా వచ్చిన వారికి మాత్రం షాకింగ్ ట్విస్ట్ ఎదురైంది. ఉదయం థియేటర్ వద్దకు వచ్చేసరికి 'ఇరుముడి 'మూవీ స్థానంలో 'టాక్సిక్' ప్రదర్శనకు సిద్ధం కావడం ప్రేక్షకులను ఆగ్రహానికి గురిచేసింది. దీంతో సినిమా మళ్లీ వేయాల్సిందే అంటూ గేటు ముందు ధర్నాకు దిగారు. అవసరమైతే నేలపై కూర్చొని అయినా చూస్తామని, ఎంత రద్దీ ఉన్నా భరిస్తామని స్పష్టం చేశారు. అసలు ఎవరి ఒత్తిడితో 'ఇరుముడి 'ని తీసేశారో థియేటర్ యాజమాన్యం చెప్పాలని డిమాండ్ చేశారు.



## టాక్సిక్.. టార్చర్

( మొదటి పేజీ తరువాయి )

అంచనాలు నెలకొన్నాయి. మలయాళీ నటి గీతూ మోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. సినిమాను ప్రేక్షకులను తీవ్రస్థాయిలో డిసప్పాయింట్ చేసింది. టాక్సిక్ ఓ టార్చర్ గా మారిపోయింది. సినిమాపై పెట్టుకున్న భారీ అంచనాలు నిదానంగా కరిగిపోవడంతో థియేటర్లలో ప్రేక్షకులు అసహనంగా అరుపులు అరిచే పరిస్థితి వస్తుంది. అసలు ఏ పాత్ర ఎందుకు వస్తోందో? ఎందుకు వెళుతుందో? హీరోతో వాళ్ళకు ఉన్న వైరం ఏమిటో? ఎవరీ అర్థం కాదు. మరబొమ్మల్లా తెర మీద జరిగే సన్నివేశాలను ప్రేక్షకులు చూడాల్సిన పరిస్థితి. ఇలాంటి కథను చెప్పిన గీతూ మోహన్ దాస్‌ను నమ్మి, ఈ ప్రాజెక్ట్ ఆమె చేతిల్లో పెట్టిన యశ్, వెంకట్ నారాయణ టేస్ట్ కు, గట్స్ కు హ్యాట్సాఫ్ చెప్పాలంటున్నారు. టాక్సిక్' దెబ్బకు 'ఇరుముడి ' సినిమా కలెక్షన్స్ పెరిగి... అది అతి త్వరలోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరవచ్చని చెబుతున్నారు.



## భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్ తయారీకి

### కేంద్రం చర్చలు

**ఢిల్లీ, మహా :** ఐఫోన్‌ల తయారీకి ఇప్పటికే కీలక కేంద్రంగా మారుతున్న భారత్‌ను యాపిల్ మరింత పెద్ద తయారీ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం కోరుతోంది. అయితే ఐప్యాడ్‌లు, మ్యాక్‌బుక్‌లు, యాపిల్ వాచ్‌ల వంటి ఉత్పత్తుల పూర్తి స్థాయి తయారీకి ముందు దేశంలో స్థానిక విడిభాగాల సరఫరా వ్యవస్థను నిర్మించాలని యాపిల్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్‌లో తయారవుతున్న ఐఫోన్‌లు, ఎయిర్‌ప్యాడ్‌లకే కాకుండా, ఇతర దేశాల్లోని యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి చేయడానికి కూడా భారత్‌లో తయారైన విడిభాగాలను ఉపయోగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీంతో యాపిల్ ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ పాత్ర మరింత పెరగనుంది. ఇప్పటికే భారత కంపెనీలు పీసీబీల అసెంబ్లీలు, ఫ్లెక్సిబుల్ పీసీబీలు, మెటల్ ఎన్‌క్లోజర్లు, ఇతర యాంత్రిక భాగాలు, హౌసింగ్‌లు, గ్రాఫైట్ భాగాలు, వైర్లు, ప్యాకేజింగ్ మెటీరియల్స్ వంటి వాటిని తయారు చేస్తున్నాయి. వీటిలో కొన్ని భాగాలు ఇప్పటికే భారత్ నుంచి చైనా, వియత్నాం వంటి యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి అవుతున్నాయి

# కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు?

( మొదటి పేజీ తరువాయి )

అధికారికంగా లేఖ జారీ చేశారు. ఈనెల 29న జరిగే సమావేశంలో కమిటీ చైర్మన్, సభ్యులు హాజరై ఈ ఘటనపై క్షుణ్ణంగా విచారించి, కౌశిక్ రెడ్డిపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలకు సంబంధించి నివేదికతో పాటు సిఫారసులను రూపొందించనున్నారు. మార్చిలో ఈ సంఘటన జరగ్గా, నైతికత కమిటీకి చర్యల అంశాన్ని స్పీకర్ సిఫార్సుచేశారు. కడియం శ్రీహరి మాట్లాడుతున్న సమయంలో, కౌశిక్ రెడ్డి తన చేతులతో తుపాకితో కాల్చేస్తున్నట్లు సైగలు చేస్తూ, అసభ్యకరమైన సంజ్ఞలు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సభలో పేర్కొన్నారు.

**ఇక చర్యలే**

కౌశిక్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ దళిత , గిరిజన ఎమ్మెల్యేలు తీవ్రంగా మండిపడ్డారు. కడియం శ్రీహరి వంటి 40 ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ నేతను చంపుతా



మన్నట్లుగా సంజ్ఞలు చేయడం "గుండాగిరి" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ఎమ్మెల్యే వేముల వీరేశం ఆ సమయంలో ధ్వజమెత్తారు. గతంలో కేవలం నిరసన తెలిపినందుకే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్ల సభ్యత్వాలను బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కౌశిక్ రెడ్డి సభ్యత్వాన్ని కూడా తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మొదట కౌశిక్ రెడ్డిని సభ నుంచి శాశ్వతంగా తొలగించాలని భావించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండటానికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఎథిక్స్ కమిటీని కోరారు. కౌశిక్ రెడ్డికి సంబంధించిన వీడియోలను ప్రభుత్వం ఇప్పటికే పరిశీలించింది , వాటిని కమిటీకి అందజేసింది. ఎథిక్స్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కౌశిక్ రెడ్డిపై స్పీకర్ చర్యలు తీసుకోనున్నారు. గతంలో కోమటిరెడ్డి, సంపత్ ల తరహాలోనే సభ్యత్వరద్దుకు సిఫార్సుచేసే అవకాశముందని, లేదా ఈ టర్మ్ వరకు అసెంబ్లీకి రాకుండా చర్య తీసుకునే అవకాశముందన్న చర్చ ఉంది.

# ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ 2.0

**డిప్యూటీ సీఎం భట్టి, ఉత్తమ్, శ్రీధర్ బాబు**

హైదరాబాద్, మహా : . డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0కు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం నిర్వహించగా, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రజా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు, నిపుణులు, కీలక అధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గత గ్లోబల్ సమ్మిట్‌లో కుదిరిన అవగాహన ఒప్పందాల పురోగతిని సమగ్రంగా సమీక్షించి, పెట్టుబడుల వాస్తవ కార్యరూపంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృత రోడ్‌షోలు నిర్వహించి పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానించాలని, సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేస్తూ, ఏర్పాట్లపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలిపి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కొత్త ఊపునివ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల షాక్

**హైదరాబాద్, మహా :** రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి ప్రయాణించే వాహనదారులకు భారీ షాక్ ఇచ్చే దిశగా ట్రాఫిక్ పోలీసులు కీలక అడుగులు వేస్తున్నారు. వాహనాలపై పదుల సంఖ్యలో చలాన్లు, వేల రూపాయల పెండింగ్ ట్రాఫిక్ జరిమానాలు ఉన్నప్పటికీ కొంత మంది యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నారు. వాహనదారులను ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేసేందుకు చలాన్ ఫైన్లను భారీగా పెంచినప్పటికీ.. భారీగా బకాయిలు పెరిగిపోతున్నాయి తప్ప వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనల తీరు మాత్రం మారడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించని.. ట్రాఫిక్ చలాన్లు చెల్లించని వారి జేబులకు చిల్లు వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రెడీ అయ్యారు. ఒక వాహనంపై ఉన్న ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని ఆ వాహనం ఫాస్టాగ్ అకౌంట్ నుంచి కట్ చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఈచలాన్ల వసూళ్లను సులభతరం చేయడంతో పాటు.. ట్రాఫిక్ ఉల్లంఘనలను తగ్గించేందుకు ఫాస్టాగ్‌తో చలాన్ల వ్యవస్థను అనుసంధానం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనలకు విధించే జరిమానాను సంబంధిత వాహనదారుడి ఫాస్టాగ్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మినహాయించే అవకాశం ఉంటుంది. దీనివల్ల వాహనదారులు మరింత జాగ్రత్తగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్.. ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఫాస్టాగ్ ద్వారా ట్రాఫిక్ చలాన్ల వసూలు చేసే అంశంపై హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన తుది నిర్ణయం, నిబంధనలు, సాంకేతిక అనుసంధానంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలను కెమెరాలు, ఇతర టెక్నాలజీ వ్యవస్థల ద్వారా గుర్తించి వాహనాలకు ఈచలాన్లను జారీ చేస్తున్నారు. అయితే చాలామంది వాహనదారులు జరిమానాలను చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పోలీసులు గుర్తించారు. దీంతో చలాన్ల వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో ఫాస్టాగ్ వ్యవస్థతో ట్రాఫిక్ ఈచలాన్లను అనుసంధానం చేస్తే జరిమానా విధించిన తర్వాత నిర్దేశిత నిబంధనల ప్రకారం మొత్తాన్ని ఆటోమేటిక్‌గా వసూలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల పెండింగ్ చలాన్ల సంఖ్య తగ్గడంతో పాటు, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ముందు వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫాస్టాగ్ అనేది ప్రధానంగా ఫోర్ వీల్స్, ఆపైన భారీ వాహనాలకు మాత్రమే ఉంటుంది. కానీ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలకు ఫాస్టాగ్ ఉండదు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలకు ఈ విధానం ఎలా వర్తిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే ట్రాఫిక్ చలాన్ మొత్తాన్ని ఎప్పుడు కట్ చేస్తారు.. వాహనదారులకు ముందుగా సమాచారం ఇస్తారా తప్పుగా విధించిన చలాన్లపై అప్పీల్ చేసే అవకాశం ఉంటుందా వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, అక్రమ పార్కింగ్, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రధాన ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలను పెంచడం వంటి చర్యలు కూడా అవసరమని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.

# కాళేశ్వరంపై కీలక మలుపు.. బాధ్యత రాష్ట్రానిదే!

- **ఆపరేషన్‌పై నిర్ణయం తెలంగాణదేనన్న ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి.**
- **పునరుద్ధరణ తర్వాతే వినియోగంపై నిపుణుల సూచనలు.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భవిష్యత్తుపై మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్వహణ, పునరుద్ధరణ, నీటిని ఎత్తిపోసే అంశాలపై తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కేంద్ర జల సంఘం , జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తమ పరిధులు, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలపై కీలక స్పష్టత ఇచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలను ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో నిర్వహించాలి, నీటిని ఎత్తిపోవాలా వద్దా అనే ఆపరేషనల్ నిర్ణయం రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్, రాష్ట్ర ప్రాజెక్టు అధికారుల పరిధిలోనే ఉంటుందని కేంద్ర సంస్థలు హైకోర్టుకు తెలిపాయి. అయితే మేడిగడ్డలో తలెత్తిన సమస్యల నేపథ్యంలో నిర్మాణాన్ని పునరుద్ధరించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగించడం అవసరమని ఎన్ డి ఎస్ ఏ తన సాంకేతిక పరిశీలనల ఆధారంగా స్పష్టం చేసింది. దీంతో కాళేశ్వరం విషయంలో ఇప్పటివరకు కేంద్ర సంస్థల అనుమతి కోసం ఎదురుచూస్తున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ ప్రశ్నలు లేవనెత్తగా, ప్రభుత్వం మాత్రం ప్రజా భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ శాస్త్రీయ, సాంకేతిక సిఫారసుల ఆధారంగానే ముందుకు వెళ్తామని చెబుతోంది.

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి సంబం



ధించిన సమస్యలు 2023 అక్టోబర్‌లో బయటపడినప్పటి నుంచి ఈ భారీ సాగునీటి ప్రాజెక్టు భవిష్యత్తు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద అంశంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీలో కొన్ని పిల్లర్లు కుంగిపోవడంతో ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, డిజైన్, పునాది, నిర్మాణ పద్ధతులు, నిర్వహణ, నీటి నిర్వహణ వంటి అంశాలపై కేంద్ర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, నిపుణులు, రాజకీయ పార్టీలు విస్తృతంగా చర్చించాయి. అనంతరం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై కూడా పరిశీలనలు జరిగాయి. ఇప్పుడు ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి, హైకోర్టుకు సమర్పించిన తాజా వివరణలు కాళేశ్వరం వివాదాన్ని మరో దశకు తీసుకెళ్లాయి.

**హైకోర్టులో కేంద్ర సంస్థల కీలక వివరణ**

తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కాళేశ్వరం వ్యవస్థలోని ఇతర కీలక భాగాల సాంకేతిక భద్రతను సమగ్రంగా పరిశీలించి, వాటిలో ఏ భాగాన్ని సురక్షితంగా పరిమిత స్థాయిలోనైనా ఉపయోగించవచ్చో స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు కేంద్ర సంస్థల నుంచి వారి పరిధి, బాధ్యతలపై వివరణ కోరింది.

దానికి ప్రతిగా ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి తమ తమ అఫిడవిట్లను సమర్పించాయి. ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన తుది ఆపరేషనల్ నిర్ణయం తమ వద్ద లేదని, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్, ప్రాజెక్టు యజమాని అయిన రాష్ట్ర ప్రభుత్వమే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కేంద్ర సంస్థలు స్పష్టం చేశాయి. అయితే సాంకేతిక భద్రత, డ్యామ్ సేఫ్టీ ప్రమాణాలు, పునరుద్ధరణకు అవసరమైన మార్గదర్శకాలు అందించడం తమ పరిధిలో ఉంటుందని తెలిపాయి. ఈ వివరణ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి ఎప్పుడు నడపాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్ డి ఎస్ ఏ , ఇతర సాంకేతిక సంస్థల సూచనలు, అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్లు పలుమార్లు పేర్కొంది. తాజా అఫిడవిట్లలో మాత్రం ఆపరేషన్‌కు సంబంధించిన తుది నిర్ణయం రాష్ట్ర పరిధిలోనే ఉందని కేంద్ర సంస్థలు చెప్పడంతో ఇప్పుడు ప్రభుత్వం ముందున్న బాధ్యత మరింత స్పష్టమైంది.

**ఎన్ డి ఎస్ ఏ చెప్పింది పునరుద్ధరణ తప్పనిసరి అని**

అయితే కేంద్ర సంస్థలు రాష్ట్రానిదే ఆపరేషనల్ బాధ్యత అని చెప్పడం అంటే కాళేశ్వరం బ్యారేజీలను వెంటనే నడపవచ్చని అర్థం కాదు. ముఖ్యంగా మేడిగడ్డలో తలెత్తిన నిర్మాణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎన్ డి ఎస్ ఏ ఇప్పటికే పునరుద్ధరణ, భద్రతా చర్యలపై స్పష్టమైన సాంకేతిక అభిప్రాయాలను వెల్లడించింది. 2023లో మేడిగడ్డలో పిల్లర్లు కుంగిన తర్వాత ఎన్డీఎస్ఏ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అక్కడి పరిస్థితులను పరిశీలించింది. సుప్రీంకోర్టు రికార్డులో నమోదైన వివరాల ప్రకారం, కమిటీ మేడిగడ్డలో ఏర్పడిన సమస్యలకు ప్రణాళిక, డిజైన్, నాణ్యత నియంత్రణ, ఆపరేషన్-మెయింటెనెన్స్ వంటి పలు అంశాల కలయిక కారణమై ఉండవచ్చని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితిలో బ్యారేజీ పూర్తిస్థాయి పునరుద్ధరణ పొందే వరకు దాని పనితీరు తీవ్రంగా ప్రభావితమైందని, ప్రస్తుతం ఉన్న స్థితిలో రిజర్వాయర్‌ను నింపడం సమస్యను మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది.

ఇదే కారణంగా ప్రభుత్వం కాళేశ్వరం వ్యవస్థను తిరిగి వినియోగించే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. మేడిగడ్డ సమస్యను పక్కనపెట్టి నీటిని నిల్వ చేయడం లేదా బ్యారేజీపై అదనపు హైడ్రాలిక్ ఒత్తిడి పెంచడం వల్ల భవిష్యత్తులో మరింత ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్న నిపుణుల ఆందోళనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది.

**అయితే అన్నారం, సుందిళ్ల పరిస్థితి ఏమిటి?**

ఇక్కడే తాజా పరిణామం మరో కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. మేడిగడ్డలో తీవ్రమైన సమస్యలు బయటపడినప్పటికీ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి కూడా అదే స్థాయిలో ఉందా? లేక వాటిలో కొంత భాగాన్ని అవసరమైన భద్రతా ప్రమాణాలతో వినియోగించగలమా? అన్న అంశంపై తాజాగా సాంకేతిక అధ్యయనాలు జరిగాయి.కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ నిర్వహించినపరిశీలనలకు సంబంధించిన వివరాలపై తెలంగాణ టుడే నివేదిక ప్రకారం, అన్నారం, సుందిళ్లలో పెద్ద స్థాయి కాంక్రీట్ నాణ్యత సమస్యలు గుర్తించలేదని, మేడిగడ్డలో ప్రధాన నిర్మాణ సమస్య బ్లాక్-7 చుట్టూ కేంద్రీకృతమై ఉందని సాంకేతిక పరిశీలనలు సూచించాయి.



## 29న మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

( మొదటి పేజీ తరువాయి )

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 29న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చేతులమీదుగా గోదావరి జలాలు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాయన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించి వారి వ్యవసాయానికి భరోసా కల్పించడమే తన లక్ష్యమని, ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

- **ఆర్మీ మేజర్ భార్య ఫొటోల మార్ఫింగ్**
- **వేధింపులకు పాల్పడుతున్న సైబర్ ముఠా**

**హైదరాబాద్, మహా :** సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా మోసాలతో అమాయకులను నిండా ముంచుతున్నారు. తాజాగా ఓ ఆర్మీ మేజర్ భార్య ఫోటోలను మార్ఫింగ్ చేసిన సైబర్ ముఠా వేధింపులకు పాల్పడింది. ఈ ఘటనపై బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు హైదారాబాద్ సైబర్ పీఎస్‌లో కేసు నమోదైంది. సికింద్రాబాద్ నివాసి, ఆర్మీలో పని చేస్తున్న ఓ మేజర్ భార్య ఎయిర్ ఇండియా క్యాబిన్ క్రూలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు ఆమెను టార్గెట్ గా చేసుకొని సోషల్ మీడియాలోని ఆమె వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను సేకరించి ఏఐ సాంకేతికతతో అసభ్యకరమైనవిగా మార్ఫింగ్ చేశారు.. ఆ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఆమె బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు పోస్టులు పెడుతూ డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దీంతో మేజర్ స్వయంగా ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరికరాల ద్వారా పరిశోధన చేసి, నిందితులు ఉపయోగించిన సోషల్ మీడియా లింక్‌లను, అకౌంట్ల వివరాలతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇటువంటి ఘటనలు జరిగితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

## 29న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం

**అశ్వాపురం, మహా :** తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతులకు శుభవార్త. రైతుల చిరకాల ఆకాంక్షగా ఉన్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఈ నెల 29న ప్రారంభం కానుంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్యలు మరింతగా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పథకం రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయకట్టు పరిధిలోని రైతులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.

## సామాన్యుల ఆస్తుల పై ఆంక్షలెందుకు?

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములు, ఇళ్ల స్థలాలు కూడా జాబితాలో చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై న్యాయ విచారణ జరిపించాలని, పూర్తి శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధితులు ఆస్తుల విక్రయం, రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తప్పుల సవరణ కోసం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. మరోవైపు 22ఏ జాబితా ప్రభుత్వ, అసైన్డ్, ఇతర రక్షిత భూములను అక్రమ రిజిస్ట్రేషన్ల నుంచి కాపాడేందుకేనని ప్రభుత్వం చెబుతోంది.22ఏలో తప్పుగా చేర్చిన ప్రైవేటు ఆస్తులను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ కోరుతోంది. జాబితాలో ఎన్ని ఆస్తులు చేర్చారు, ఎన్ని తొలగించారు, కారణాలేమిటనే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారం భూ హక్కులు, రిజిస్ట్రేషన్లపై ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది.






# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

**అక్కడికక్కడే ఆరుగురు మృతి, మరో 20 మందికి గాయాలు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ విజయవాడ హైవేపై తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది.అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ఏలూరుకు బయల్దేరింది. బస్సుకు ఇద్దరుడ్రైవర్లు ఉండగా. సూర్యాపేట సమీపంలో డ్రైవర్ ఛేంజ్ అయ్యారు. ఆ తర్వాత బస్సు బయల్దేరగా కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలోకి చేరుకోగానే ముందు ఐరన్ రాడ్లతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. బస్సు రైట్ యాక్సిడెంట్ కాగా ఐరన్ రాడ్లు బస్సులోపలికి దూసుకెళ్లాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో కలిపి మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సహాయక చర్యలు చేట్టి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతి చెందిన వారంతా ఏపీకి చెందిన వారని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు విజయవాడకు చెందిన లొల్లి పోగు మేరీ జ్యోత్స్న (39), భావన (25), పిడికిటి లక్ష్మీ (31), ఎన్టీఆర్ జిల్లా తెల్లప్రోలుకు చెందిన యాసారపు చిన్ని(31), భీమవరంకు చెందిన షకీనా (24), కృష్ణా జిల్లా పడమట పల్లికి చెందిన చెన్న కేశవుల నాగేంద్రబాబు (31) ఉన్నారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి**

సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. ప్రమాదంపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి, కేటీఆర్ స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం**

కోదాడ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వివరించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, తెలంగాణ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఏపీ రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి**

ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేటు బస్సు భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యతగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని మంత్రి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

# 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం

- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లలో పోటీల నిర్వహణ
- దేశం నలుమూలల నుంచి పాల్గొననున్న 6వేలకు పైగా క్రీడాకారులు
- యువ క్రీడాకారులతో వర్చువల్‌గా మాట్లాడనున్న ప్రధాని నరేంద్రమోదీ




**న్యూఢిల్లీ, మహా :** భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదును పెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది. 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది.ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీఎఫ్ఐ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు.

**కిషన్ రెడ్డి హర్షం**

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్, అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది.తెలుగు తేజం.. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా.. టాప్స్ కార్యక్రమం ద్వారా.. అంతర్జాతీయ స్థాయి శిక్షణ, సపోర్టింగ్ స్టాఫ్ సహకారంతో.. ఒలింపిక్స్ మెడల్ సాధించింది. క్రీడారంగంలో ఆమె రాణిస్తున్న తీరును ప్రోత్సహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం 2015లో పద్మశ్రీ, 2020లో పద్మభూషణ్ అవార్డును అందించింది. ఇలాంటి క్రీడాకారులెందరికో.. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2014కు ముందు మొత్తం 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో.. 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15 పతకాలు సాధించారు. పారాలింపిక్స్‌లోనూ.. 2014కు ముందు దేశం కేవలం 8 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 పారాలింపిక్స్‌లో.. 52 పతకాలు సాధించాం. 2014కు ముందు దేశంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ.1,219 కోట్లుండగా.. 202526లో ఇది రూ.3,794 కోట్లకు పెరిగింది. దేశంలో 2014కు ముందు రూ.191 కోట్ల విలువైన 38 స్పోర్ట్స్ ప్రాజెక్టులుండగా.. ఈ 12 ఏళ్లలో 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.3,181 కోట్లు. మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం (ఆగస్టు 27న).. దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం

- వెయ్యి మందికిపైగా గల్లంతు!
- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు.
- సహాయక చర్యలకు 15 హెలికాప్టర్లు





**కాఠ్మాండు, మహా:** నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు తీవ్ర బీభత్సం సృష్టిస్తున్నాయి. టిబెట్ సరిహద్దు వైపు నుంచి ఒక్కసారిగా పోటెత్తిన వరద నీటితో భోటేకోశీ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాడింగ్, రసువా జిల్లాల్లోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. వరద ఉద్ధృతికి గ్రామాలు, వంతెనలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. రసువా జిల్లాలో బుధవారం ఉదయం సంభవించిన ఆకస్మిక వరదల్లో సుమారు వెయ్యి మంది నీటిలో కొట్టుకుపోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆందోళన మరింత పెరిగింది.భోటేకోశీ నది ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాణభయం నెలకొంది. వరద ప్రవాహం ధాటికి ఇళ్లు, రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదలే ఈ విధ్వంసానికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి వేగంగా విషమిస్తుండటంతో నదికి సమీపంలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు యంత్రాంగం అప్రమత్తమైంది.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. బాధితులను గుర్తించి రక్షించేందుకు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. బుసి, తుసు ప్రాంతాల్లో సహాయక సిబ్బంది ఇప్పటివరకు 20 మందిని సురక్షితంగా రక్షించినట్లు అధికారులు తెలిపారు. వరదల్లో గాయపడిన వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలను నీటిలో నుంచి వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు.భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. గల్లంతైన వారిలో భారతీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వస్తున్న సమాచారం నేపథ్యంలో వారి ఆచూకీ కోసం ప్రత్యేకంగా వివరాలు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ వరద ఉద్ధృతి, దెబ్బతిన్న రహదారులు, వంతెనల కారణంగా సహాయక బృందాలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మృతుల సంఖ్య, గల్లంతైన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

- కాంగ్రెస్‌లోనే కొనసాగుతా.
- భట్టి విక్రమార్కతో ఎలాంటి చర్చ జరగలేదు.
- కొండా మురళి



**వరంగల్, మహా :** సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. ఆమె తన అభిప్రాయాలను స్వతంత్రంగా వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆమె వ్యాఖ్యలను ప్రశ్నించే హక్కు తమకు లేదని అన్నారు. సుస్మిత తనకు నచ్చిన విధంగా తన అభిప్రాయాలను వెల్లడించారని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమైనవేనని స్పష్టం చేశారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ జరపలేదని కొండా మురళి తెలిపారు. ''మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?'' అని వ్యాఖ్యానించారు. పార్టీ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నింటినీ ఇప్పటికే వివరించామని, ఈ విషయంలో తమ వైపు నుంచి చెప్పాల్సింది ఏమీ లేదని పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని ఆయన తేల్చిచెప్పారు.

పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ప్రకంపనలు రేపుతున్న నేపథ్యంలో కొండా మురళి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని సుస్మిత విమర్శించడంతో పాటు, పరకాల అసెంబ్లీ టికెట్‌ను రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించడం పార్టీలో చర్చకు దారితీసింది.

సుస్మిత వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. ఆమెపై చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చింది. అంతేకాకుండా ఆమె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పీసీసీ కొండా సురేఖను కోరాలని నిర్ణయించింది. అయితే సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని కొండా సురేఖ ఇప్పటికే స్పష్టం చేశారు. తాజాగా కొండా మురళి కూడా అదే వైఖరిని వెల్లడించడంతో ఈ వ్యవహారంలో కొండా కుటుంబం పార్టీ అధిష్ఠానానికి తమ రాజకీయ వైఖరిని స్పష్టంగా తెలియజేసినట్లయింది.

సుస్మిత వ్యాఖ్యలపై పార్టీ అంతర్గతంగా చర్చ కొనసాగుతున్నప్పటికీ, తాను మాత్రం కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని కొండా మురళి స్పష్టం చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. పరకాల టికెట్ అంశం, సుస్మిత చేసిన వ్యాఖ్యలు, పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పందన నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# బెజవాడ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్

- టీడీపీలోకి వంగవీటి ఆశా కిరణ్?
- మేయర్ రేసులో వంగవీటి వారసురాలు.
- కాపు ఓటు బ్యాంకుపై టీడీపీ గురి.
- విజయవాడ మేయర్ పీఠం దక్కేనా?




**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, అందులోనూ విజయవాడ రాజకీయాలు ఎప్పుడూ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. దశాబ్దాలు గడుస్తున్నా బెజవాడ గడ్డపై 'వంగవీటి' అనే పేరుకు ఉన్న క్రేజ్, రాజకీయ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. దివంగత నేత వంగవీటి మోహన రంగా వారసత్వం చుట్టూ అల్లుకున్న రాజకీయాలు ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటాయి. తాజాగా బెజవాడ రాజకీయ చిత్రపటంలో మరో ఆసక్తికరమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోందన్న ప్రచారం ఊపందుకుంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారన్న వార్తలు ఇప్పుడు ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయిఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా కృష్ణా జిల్లా పాలిటిక్స్‌లో వంగవీటి కుటుంబానికి ఒక ప్రత్యేకమైన అధ్యాయం ఉంది. రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ఇప్పటికే పలు పార్టీలలో కొనసాగుతూ రాజకీయంగా తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తుండగా, ఇప్పుడు అనూహ్యంగా రంగా కుమార్తె ఆశా కిరణ్ పేరు తెరపైకి రావడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె తెలుగుదేశం పార్టీకి దగ్గరవుతున్నారని, త్వరలోనే పసుపు కండువా కప్పుకోబోతున్నారనే ఊహాగానాలు బెజవాడ రాజకీయాల్లో జోరుగా సాగుతున్నాయి. గత కొంతకాలంగా తెరవెనుక రాజకీయాల్లో చురుకుగా ఉంటూ వస్తున్న ఆశా కిరణ్, ఇప్పుడు ప్రత్యక్ష వేదికపైకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమె టీడీపీ అధిష్ఠానంతో ొటచ్‌లోకి వెళ్లారని, ఇరు వర్గాల మధ్య సానుకూల చర్చలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాల భోగట్టా.ఆశా కిరణ్ రాజకీయ ఎంట్రీ కేవలం ఒక సాధారణ అరంగేట్రంగా కాకుండా, ఒక స్పష్టమైన వ్యూహంతో సాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. బెజవాడ నడిబొడ్డున ఉన్న విజయవాడ నగరపాలక సంస్థ (మేయర్) పీఠంపై ఆమె కన్నేశారని తెలుస్తోంది. మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగడం ద్వారా తనకంటూ ఒక బలమైన రాజకీయ పునాదిని నిర్మించుకోవాలని, తండ్రి రాజకీయ వారసత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆమె యోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తెలుగుదేశం పార్టీ కూడా ఈ ప్రతిపాదనను అత్యంత సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడ నగరంలో కాపు సామాజిక వర్గం ఓటు బ్యాంకు అత్యంత కీలకం అన్న విషయం తెలిసిందే. ఇన్నాళ్లు రంగా అభిమానులను, కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు వివిధ పార్టీలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి. ఇప్పుడు ఏకంగా రంగా కుమార్తెనే బరిలోకి దించితే, ఆ సామాజిక వర్గం ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకోవచ్చని తెలుగుదేశం పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఆశా కిరణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, కాపు సామాజిక వర్గంలో వంగవీటి కుటుంబం పట్ల ఉన్న బలమైన సానుభూతిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు టీడీపీ అధినాయకత్వం పకడ్బందీగా పావులు కదుపుతోంది. ఆశా కిరణ్‌కు మేయర్ వంటి కీలక పదవిని ఆఫర్ చేస్తే, అటు పార్టీకి బలమైన ఓటు బ్యాంకు అండగా నిలవడంతో పాటు, ఇటు ఆశా కిరణ్ రాజకీయ ప్రయాణానికి కూడా ఒక గొప్ప ఆరంభం లభిస్తుంది. ఇరు పక్షాలకు ఇది లాభసాటి వ్యూహం కావడంతో తెరవెనుక మంతనాలు తుది దశకు చేరుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే, రంగులు మార్చే రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏం జరుగుతుందో కచ్చితంగా చెప్పలేం. ప్రచారంలో ఉన్నట్లుగా వంగవీటి వారసురాలు నిజంగానే సైకిల్ ఎక్కుతారా? విజయవాడ మేయర్ రేసులో తెలుగుదేశం పార్టీ తరఫున అధికారికంగా బరిలో నిలుస్తారా? ఆశా కిరణ్ ఎంట్రీతో కాపు సమీకరణాలు టీడీపీకి ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇస్తాయా? అన్నది ఇప్పుడు అత్యంత ఉత్కంఠగా మారింది. ఆశా కిరణ్ తీసుకునే తదుపరి నిర్ణయం బెజవాడ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఆమె నిజంగానే టీడీపీ కండువా కప్పుకుని, మేయర్ రేసులో నిలిస్తే మాత్రం, బెజవాడ కార్పొరేషన్ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర బిందువు కావడం ఖాయం. ఈ ఆసక్తికర రాజకీయ పరిణామంపై పూర్తి స్పష్టత రావాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# మంత్రి అడ్లూరికి ఎమ్మెల్యే పాయం వినతి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు.నియోజకవర్గంలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు సరిగా లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో పలు బీటీ రోడ్లు, హై లెవల్ వంతెనల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఈ పనులకు త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని మంత్రి అడ్లూరిని కోరినట్లు తెలిపారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రైతులు పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.



# ప్రపంచీకరణకు నిర్వచనాన్ని మారుస్తున్న భారతీయ తత్వం!

ఒక ఆలోచన నిశ్శబ్దంగా మొదలై, శతాబ్దాల కాలప్రవాహంలో కోట్లాది మందిని సేవారంగంలో నడిపించి, నేడు ప్రపంచ వేదికపై ఒక చారిత్రక సంభాషణగా మారిన వైనం అపూర్వం. నేడు ప్రపంచం అనేక ఘర్షణలు, యుద్ధాలు, అశాంతితో కొట్టుమిట్టాడుతోంది. పశ్చిమాసియా, తూర్పు ఐరోపాలలో నెలకొన్న ఉద్రిక్తతల నడుమ.. సాంత్వననిచ్చే ఒక చల్లని చిరుగాలి పశ్చిమ దేశాల వైపు వీస్తోంది. ఆ గాలి పేరే 'సార్వత్రిక ఏకత్వం' ఆంగ్లంలో యూనివర్సల్ ఒన్‌నెస్. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఈ చారిత్రక తరుణంలో.. సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ న్యూయార్క్, టొరంటో, లండన్ నగరాల్లో పర్యటిస్తూ ఇస్తున్న సందేశం.. ప్రాచీన భారతీయ తాత్వికత, ఆధునిక ప్రపంచంతో జరుపుతున్న సౌభ్రాతృత్వ సంభాషణ.. అంతర్జాతీయ సమాజానికి గొప్ప మేల్కొలుపుగా మారుతోందనేదే ఈ విశ్లేషణ. 'దిమాగీ నక్సల్స్'కు మేధోపరమైన సమాధానం ఒక ప్రత్యర్థిని అణచివేసి మూలకి నెట్టడానికి అనేక మార్గాలుంటాయి. వారిని దూషించవచ్చు, తప్పుడు కేసులు బనాయించవచ్చు, నిందించవచ్చు లేదా వారి ప్రతిష్ఠను దెబ్బతీయవచ్చు. మీ పై వారికున్న వ్యతిరేకతను, పూర్తి స్థాయి శత్రుత్వాన్ని ప్రదర్శించడానికి వారిని చట్టవిరుద్ధమైన వారిగా చిత్రించడానికి లేదా అపహాస్యం చేయడానికి ప్రయత్నించవచ్చు. ప్రత్యర్థి తిరుగులేని, అజేయమైన స్థాయి ఉన్న సంస్థ అయితే, అప్పుడు ఆ సంస్థ అధినేతను లక్ష్యంగా చేసుకుంటారు. సరిగ్గా ఇలాగే, పాశ్చాత్య దేశాలైన యుఎస్, కెనడా, యునైటెడ్ కింగ్ డమ్ లో ఉన్న కొందరు మత ఛాందసవాదులు, వామపక్ష ఉగ్రవాదులు ఆర్.ఎస్.ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్






మోహన్ భాగవత్‌ను సరిగ్గా ఇలాగే లక్ష్యంగా చేసుకున్నారు. సత్కార్యాలు చేసేటప్పుడు విమర్శలు, అడ్డంకులు సహజం. భారతదేశ చరిత్రను, నైతికతను వక్రీకరించే మేధో తీవ్రవాదాన్ని అంటే ఇంటెలెక్చువల్ టెర్రరిజం మనం చూస్తూనే ఉన్నాం. తుషార్ అమ్రీష్ గోయెల్ దర్శకత్వం వహించిన 'ది తాజ్ స్టోరీ' చిత్రంలో విష్ణు దాస్ పాత్రలో నటించిన పరేష్ రావల్ ఈ తరహా మేధో తీవ్రవాదాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. ఎర్రకోటపై నుంచి భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇలాంటి శక్తులనే 'దిమాగీ నక్సల్స్' అని అభివర్ణించారు. కానీ, సత్యం ముందు ఈ విద్వేష ప్రచారాలు ఆకాశాన్ని తాకలేక చతికిలపడ్డాయి. అమెరికా గడ్డపై ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ అడుగుపెట్టగానే ఈ మేధో తీవ్రవాదానికి చరమగీతం పాడినట్లయింది.

చికాగో స్ఫూర్తి.. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ప్రతిధ్వని.. ఈ సందర్భం మనకు సరిగ్గా 131 సంవత్సరాల క్రితం నాటి ఒక చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేస్తోంది. సెప్టెంబరు 11, 1893న చికాగోలో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంట్‌లో స్వామి వివేకానంద సహనం, సమ్మిళితత్వం, విశ్వవ్యాప్త అంగీకారంతో కూడిన 'సార్వత్రిక ఏకత్వం' అనే సందేశాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. నేడు అదే స్ఫూర్తితో, ఈ శనివారం న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఎహెడ్ అంటే అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఆధ్వర్యంలో 200లకు పైగా సంస్థల కలయికతో 'యూనివర్సల్ వన్‌నెస్' సదస్సు జరగనుంది. 6000 మందికి పైగా అమెరికన్ నివాసితులు, ప్రజా ప్రతినిధులు, బహుళ మత నాయకులు పాల్గొంటున్న ఈ వేదికపై డాక్టర్ భాగవత్ ప్రధాన వక్తగా ప్రపంచానికి భారతీయ ఆత్మను పరిచయం చేయనున్నారు. నిజమైన ప్రపంచీకరణ అంటే.. 'వసుధైవ కుటుంబకం'.. పాశ్చాత్య దేశాల దృష్టిలో ప్రపంచీకరణ అంటే కేవలం వస్తువులు, సేవలకు మార్కెట్‌ను సృష్టించడం మాత్రమే. కానీ భారత్ దృష్టిలో ప్రపంచీకరణ అంటే సామాజిక స్థాయిలో ఆధ్యాత్మికత, శాంతి, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం. అదే 'వసుధైవ కుటుంబకం'. సకల చరాచర సృష్టిని ఒకే కుటుంబంగా చూడటం కేవలం మన నినాదం కాదు, నిత్య జీవన దృక్పథం. మానవాళిని పట్టి పీడిస్తున్న ఘర్షణలు, నిరక్షరాస్యతను రూపుమాపడానికి గతంలో దలైలామా, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, పోప్ ఫ్రాన్సిస్ వంటి మహనీయులు 'గ్లోబల్ టుగెదర్‌నెస్' (ప్రపంచ ఐక్యత) కు పిలుపునిచ్చారు. ఇప్పుడు అదే శాంతి సందేశాన్ని భారత్ నుండి ఆర్.ఎస్.ఎస్ సర్ సంఘచాలక్ తీసుకువెళుతూ.. పర్యావరణ అనుకూల జీవనశైలి, కుటుంబ వ్యవస్థలు, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ప్రపంచ దేశాలకు సరికొత్త దృక్పథాన్ని అందిస్తున్నారు.

**సమన్వయానికి వారధి:**

కుతంత్రాలకు చెక్.. కెనడా వంటి దేశాల్లో ఖలిస్తానీ తీవ్రవాదులు, పాకిస్తాన్ కుతంత్రాలతో ప్రేరేపితమైన ఇస్లామిస్ట్ రాడికల్స్ హిందూ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న వేళ ఈ పర్యటన అత్యంత కీలకం. చాలామంది సిక్కు నాయకులు ఈ విద్వేష ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో న్యూయార్క్, లండన్, టొరంటోలలో అగ్రశ్రేణి సిక్కు నాయకులతో డాక్టర్ భాగవత్ సమావేశం కావడం, ఇరు వర్గాల మధ్య ఉన్న అపోహలను తొలగించి, సామరస్యాన్ని పెంపొందించడానికి ఒక గొప్ప ముందడుగు. దౌత్యం ప్రభుత్వాలను కలిపితే.. సంస్కృతి మానవత్వాన్ని ఏకం చేస్తుంది. దౌత్యపరమైన సంబంధాలు రాజకీయ, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కావచ్చు. కానీ సంస్కృతి ప్రజల హృదయాలను కలుపుతుంది. ఆపదలో రక్తదానం, ఆకలి తీర్చే అన్నదానం, విపత్తుల్లో పునరావాసం వంటి నిస్వార్థ సేవలను వందేళ్లుగా చేస్తూ నాగ్‌పూర్ మైదానంలో మొదలైన ఒక నిశ్శబ్ద ఆలోచన.. నేడు ప్రపంచ వేదికపై ఒక గొప్ప నాగరికతా సంభాషణగా రూపుదిద్దుకోవడం చారిత్రాత్మకం. కెరీర్ కంటే 'శీల నిర్మాణం' మిన్న! ఆడంబరాల వేటలో పరుగులెడుతున్న నేటి యువతకు ఈ పర్యటన ఒక బలమైన మేల్కొలుపు. "కెరీర్ కంటే శీలనిర్మాణం మిన్న.. సౌకర్యం కంటే సమాజ శ్రేయస్సే ముఖ్యం." విజ్ఞానం ఎంత ఉన్నా.. నైతిక విలువలు, సేవా దృక్పథం లేకపోతే ఆ ప్రగతి అర్థరహితం. యువత యోగా, ఆయుర్వేదం, ధ్యానం వంటి శాస్త్రీయ జీవన విధానాలను అలవర్చుకుని శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రస్థానం కేవలం ఒక మైలురాయిని చేరుకుని విశ్రమించడం కాదు; రాబోయే నూతన శతాబ్దపు సుస్థిర నిర్మాణానికి తెరిచిన ప్రవేశ ద్వారం. వ్యక్తి వికాసం ద్వారా జాతి నిర్మాణం, తద్వారా లోక కళ్యాణం కోసం పురాతన నాగరికత కలిగిన భారత్, పాశ్చాత్య దేశాలతో జరుపుతున్న ఈ అనుసంధానం.. రేపటి సరికొత్త, ప్రశాంతమైన ప్రపంచానికి వేస్తున్న పటిష్టమైన పునాది అని సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సందేశం!



**శివ కుమార్ గనివాడ, సీనియర్ సోషల్ అనలిస్ట్,**

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**

mahaapatrika@gmail.com

whatsapp:

74369 39999

# ప్రయోగాలు కాదు భరోసా కావాలి



భారతదేశంలో సాంకేతిక విద్యకు దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర ఉంది. పారిశ్రామిక, నిర్మాణ, విద్యుత్, యాంత్రిక, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు అవసరమైన మధ్యస్థాయి సాంకేతిక నిపుణులను తయారు చేయడంలో పాలిటెక్నిక్ విద్య కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల విద్యార్థులకు తక్కువ వ్యవధిలో ఉద్యోగానికి ఉపయోగపడే సాంకేతిక విద్యను అందించే వ్యవస్థగా పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే పాలిటెక్నిక్ విద్యను బలహీనపరచడం లేదా దాని స్వతంత్ర విద్యా వ్యవస్థను తొలగించే ప్రయత్నం జరిగితే అది కేవలం ఒక విద్యా సంస్థాగత మార్పు కాదు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే నిర్ణయం అవుతుంది. భారతదేశంలో ఆధునిక సాంకేతిక విద్యకు పునాది 19వ శతాబ్దంలోనే పడింది. 1847లో రూర్కీలో థామస్ ఇంజనీరింగ్ కాలేజ్, అనంతరం 1856లో కలకత్తా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, 1858లో పూనా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వంటి సంస్థలు ఏర్పడ్డాయి. 1887లో ముంబైలో విక్టోరియా జూబ్లీ ఇనిస్టిట్యూట్ కూడా ప్రారంభమైంది. అయితే ప్రత్యేకంగా "పాలిటెక్నిక్" పేరుతో ప్రారంభమైన తొలి సంస్థల్లో ఒకటిగా 1909లో రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్ స్థాపించిన ప్రేమమహావిద్యాలయన్ని పేర్కొంటారు. తరువాత 1914లో గవర్నమెంట్ పాలిటెక్నిక్, నాగ్ పూర్ వంటి సంస్థలు డిప్లొమా ఆధారిత సాంకేతిక విద్యకు బలమైన పునాది వేశాయి. అంటే పాలిటెక్నిక్ విద్య అనేది నిన్న మొన్న ప్రారంభమైన ప్రయోగం కాదు. భారతదేశ పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధితో పాటు ఎదిగిన దీర్ఘకాలిక విద్యా వ్యవస్థ. స్వాతంత్ర్యం తర్వాత వేగంగా అభివృద్ధి. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో ఇంజినీరింగ్ కళాశాలలు 44, పాలిటెక్నిక్ సంస్థలు 43 మాత్రమే ఉండగా, వాటి ప్రవేశ సామర్థ్యం కూడా పరిమితంగానే ఉండేది. తరువాత ఐదేళ్ల ప్రణాళికలు, పారిశ్రామికీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల విస్తరణతో సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరిగింది. 1945లో ఏఐసీటీఈ జాతీయ సాంకేతిక విద్యా సలహా సంస్థగా ఏర్పడింది. అనంతరం ఏఐసీటీఈ యాక్ట్, 1987 ద్వారా సాంకేతిక విద్యా వ్యవస్థకు ప్రణాళిక, సమన్వయం, ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ వంటి అంశాల్లో చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పడింది.ఈ పరిణామాలతో పాలిటెక్నిక్ విద్య దేశవ్యాప్తంగా విస్తరించింది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి సంప్రదాయ కోర్సులతో పాటు కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆటోమొబైల్, ఫార్మసీ, ఆధునిక సాంకేతిక కోర్సులు కూడా చేరాయి.

తెలంగాణలో పాలిటెక్నిక్ విద్య ప్రస్తుతం ఎస్బీటీఈటీ పర్యవేక్షిస్తోంది. 202627 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో కొత్త కోర్సులు కూడా మంజూరు చేసినట్లు ఎస్బీటీఈటీ అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. అంటే పాలిటెక్నిక్ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతూ, కొత్త కోర్సులతో విస్తరించాల్సిన దశలోనే ఉంది. తెలంగాణ విద్యా విధానానికి సంబంధించిన 2026 పరిపాలనా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 128 పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలు 59, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలు 67, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు 2 సంస్థలు. ప్రభుత్వ పాలిటెక్నిక్స్ రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఉండగా మొత్తం వ్యవస్థలో గ్రామీణ మరియు జిల్లా స్థాయి విద్యార్థులకు ప్రాధాన్యత ఉంది. అయితే ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్య ఎదుర్కొంటున్న సమస్యలు కూడా ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల పెరుగుదల, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు, సీట్ల ఖాళీలు, అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల లోపాలు వంటి సమస్యలు విద్యార్థులను ప్రభావితం చేస్తున్నాయి. 202627 విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ లలో 14,322 ఆమోదిత సీట్లకు 11,267 మంది పొందారు. ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో 14,640 సీట్లకు 8,464 మంది చేరారు. టీజీ పాలిసెట్ ఫైనల్ ఫేజ్ లో 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ లు 18,530 సీట్లలో 17,001 సీట్లు (92%) కేటాయించబడ్డాయి. 53 ప్రైవేట్ పాలిటెక్నిక్ లు 14,997 సీట్లలో సుమారు 54% మాత్రమే కేటాయించబడ్డాయి. అత్యధికంగా డిప్లొమా సీట్లు ఖాళీగా ఉన్నాయని ఒక నివేదిక పేర్కొంది. అయితే సీట్లు ఖాళీగా ఉండటం పాలిటెక్నిక్ విద్య అవసరం లేదని నిరూపించదు. సమస్య విద్యా వ్యవస్థలోని లోపాలను సరిచేయడంలో ప్రభుత్వం, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి, కానీ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని శక్తి పేరుతో పేద విద్యార్థులను సాంకేతిక విద్యకు దూరం చెయ్యాలనే ప్రయత్నాలు దాని పర్యవసనాలు విద్యార్థులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. పాలిటెక్నిక్ విద్య యొక్క ప్రత్యేకత

పదో తరగతి తర్వాత విద్యార్థికి మూడు సంవత్సరాల డిప్లొమా ద్వారా సాంకేతిక విద్యను అందించడం పాలిటెక్నిక్ వ్యవస్థలో ప్రధాన ప్రయోజనం. ఒక విద్యార్థి నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సుకు వెళ్లకముందే ప్రాక్టికల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుతారు. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు ఈసెట్ వంటి మార్గాల ద్వారా బీటెక్ లో లేటరల్ ఎంట్రీ పొందే అవకాశం ఉంది. కాబట్టి పాలిటెక్నిక్ విద్య విద్యార్థికి "చివరి గమ్యం" మాత్రమే కాదు ఉద్యోగానికి, ఉన్నత విద్యకు రెండింటికీ ఒక మార్గం.

ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను తొలగిస్తే

పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యకు అయ్యే ఖర్చుతో పోలిస్తే డిప్లొమా విద్య ద్వారా తక్కువ సమయంలో సాంకేతిక అర్హత పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్య గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు ఎంతో కీలకం. గ్రామీణ, నిరుపేద విద్యార్థి హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లి ఖరీదైన విద్యను అభ్యసించే ఆర్థిక స్థోమత కలిగి ఉండదు. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ స్థానిక విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విద్యార్థులు పరిశ్రమలకు కేవలం బీటెక్ ఇంజినీర్లు మాత్రమే అవసరం కాదు. సైట్ సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, సీఏడీ నిపుణులు, ఎలక్ట్రికల్ టెక్నీషియన్లు, మెషిన్ ఆపరేటర్లు, ఉత్పత్తి విభాగ సాంకేతిక సిబ్బంది వంటి అనేక మధ్యస్థాయి సాంకేతిక నిపుణులు అవసరం. డిప్లొమా తర్వాత బీటెక్ లో ఎంట్రీ వంటి అవకాశాలు విద్యార్థులకు విద్యా పురోగతికి మరో మార్గాన్ని అందిస్తున్నాయి. ఈ మార్గం బలహీనపడితే ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశం కష్టమవుతుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రైవేటీకరణ ఒత్తిడి పెరగవచ్చు. ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థ బలహీనపడితే విద్యార్థులు ఖరీదైన ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లాల్సిరావచ్చు. ఫలితంగా విద్య ఖర్చు పెరుగుతుంది.

ప్రస్తుతం తెలంగాణలో జీవో 97 చుట్టూ పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఆ ఉత్తర్వు పాలిటెక్నిక్ వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ తో విలీనం పునర్వ్యవస్థీకరణ దిశగా తీసుకెళ్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ అసలు ప్రశ్న "స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమా?" అనేది కాదు ఖచ్చితంగా అవసరమే. కానీ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేయడానికి పాలిటెక్నిక్ వ్యవస్థను బలహీనపరచాల్సిన అవసరం ఏమిటి.?

పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో సమన్వయం చేయాలంటే స్వతంత్ర డిప్లొమా గుర్తింపు, ఎస్బీటీఈటీ విద్యా నిర్మాణం, పరీక్షా వ్యవస్థ, ఈసెట్ ద్వారా లేటరల్ ఎంట్రీ, ప్రభుత్వ పాలిటెక్నిక్స్, అధ్యాపకుల పోస్టులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలకు పూర్తి రక్షణ కల్పించాలి. దశాబ్దాలుగా కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యను ఎందుకు బలహీనపరచాలి.?

ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదు. ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, హాస్టళ్లను ఎందుకు ఆధునీకరించడం లేదు. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను సమయానికి ఎందుకు విడుదల చేయడం లేదు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త డిప్లొమా కోర్సులను ఎందుకు ప్రారంభించడం లేదు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, సాంకేతిక నిపుణులతో విస్తృత చర్చ జరపకుండా వ్యవస్థలో మార్పులు ఎందుకు చేయాలి.? ప్రభుత్వానికి పాలిటెక్నిక్ విద్యను తొలగించడం అభివృద్ధి కాదు లోపాలను సరిచేసి ఆధునీకరించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చడమే నిజమైన సంస్కరణ. భారతదేశ సాంకేతిక విద్యా చరిత్రలో పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణలో వేలాది మంది నిరుపేద కుటుంబాల విద్యార్థులకు ఉద్యోగం, ఉన్నత విద్య, ఆర్థిక స్వావలంబనకు మార్గంగా నిలుస్తోంది.అందువల్ల పాలకులు తీసుకునే ఏ నిర్ణయమైనా పేద విద్యార్థుల భవిష్యత్తు మరియు గ్రామీణ కుటుంబాల ప్రయోజనం, సాంకేతిక విద్య నాణ్యత, ఉద్యోగావకాశాలు అనే నాలుగు అంశాలను కేంద్రంగా చేసుకుని ఉండాలి.పాలిటెక్నిక్‌లను మూసివేయడం కాదు పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలి. సాంకేతిక విద్యను కుదించడం కాదు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు కాదు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వెయ్యాలని విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.



**డాక్టర్ సాగబోయిన పాపారావు**
**(ఎంఏ, పీహెచ్ డి, ఓయు)**
**ఆదివాసీ విద్యార్థి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు తెలంగాణ.**
**సెల్ నెంబర్ :9441288991**



## ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతిష్ఠా మహోత్సవం

**హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి పరిధిలోని శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న మరకత లింగ సహిత దేవతా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, వేద పండితులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా భక్తుల కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజా కార్యక్రమాల గురించి ఆలయ నిర్వాహకుల నుంచి ఎమ్మెల్యే తెలుసుకున్నారు.



## సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్ 2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలనీ ప్రజల భద్రత, రక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాలనీలో నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమన్నారు. కాలనీ సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కుందనపల్లి సిద్దిరాములు. వెల్డింగ్ శ్రీనివాస్, జెసిబి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## మిలాద్ఉన్‌నబీ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ, ఏఎస్ రావు నగర్, చర్లపల్లి డివిజన్ లలో మిలాద్ఉన్‌నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి. ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులకు మిలాద్ఉన్‌నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలని కోరారు. సమాజంలో ప్రతి ఒక్కరు కుల మతాలకతీతంగా మతసామరస్యంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## పుష్పా స్టైల్లో కలప స్మగ్లింగ్

- **ఇటు పక్కతోంగి చూడని ఫారెస్ట్ అధికారులు**

**రాజేంద్రనగర్ మహా :** జిహెచ్ఎంసి శంషాబాద్ పరిధిలోని గ్రాండ్ విల్లా వెంచర్ సెక్టర్,1, 2, 3, లో కలప చెట్లను అర్ధరాత్రి పూట నరికివేసి దుంగలను స్మగ్లింగ్ చేస్తూ మార్కెట్లోకి తరలిస్తున్నారు. పుష్పా సినిమాను మరోసారి తలపించేటట్టుగా ఓముఠా తతంగం నడుస్తుందని స్థానికులు వాపోతున్నారు. 25 సంవత్సరాలుగా పెంచుకున్న టేకు చెట్లను ఓ ముఠా అర్ధరాత్రి వాహనాల్లో వచ్చి చెట్లను నరికి రహస్యంగా తరలిస్తూ మార్కెట్ లో అముకుంటున్నారు. ఇంత జరుగుతున్న (ఫారెస్ట్) అడవి శాఖ అధికారులు ఇటు పక్కకు తొంగించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంపదను కాపాడవలసిన అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అడవి శాఖ అధికారులు కలప చెట్లను కాపాడి సంపదను రక్షించాలని కోరుతున్నారు.



# మేడం.. కాస్త ఇటు చూడండి

- **జవహర్ నగర్ పీఎస్ లో ఎస్సైలు, కిందిస్థాయి సిబ్బంది కొరత**
- **ప్రజలకు సత్వర సేవలు దక్కడం లేదంటూ ఫిర్యాదుదారుల ఆందోళన**
- **పని ఒత్తిడి భరించలేక అనారోగ్యానికి గురౌతున్న పోలీసులు**




**కుషాయిగూడ, మహా :** ప్రజలకు న్యాయం దక్కేది ఎక్కడంటే ప్రతి ఒక్కరూ చెప్పేది పోలీస్ స్టేషన్ అనే అంటారు. అలాంటిది మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ అతిపెద్దదిగా అవతరించినప్పటికి సమస్యలు కూడా అదే స్థాయిలో ఉండటం కలవరపెడుతోంది. డీఐ, ఎస్సైలు, పోలీసు కానిస్టేబుల్ కొరతతో ప్రజలకు సరైన సేవలు అందటం లేదని సర్వత్రా వినిపిస్తుంది. తక్కువ సంఖ్యలో ఉన్న సిబ్బంది.. పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారు. జవహర్ నగర్ లో నేరాలు కోకోల్లాలు... మహిళా ఎస్సైలు ఒక్కరూ కూడా లేకపోవడంతో ఆందోళనలు. ధర్నాలలో మహిళల్ని కట్టడి చేయడం కష్టతరమవుతాది. భారీ మూల్యం చెల్లించుకోక ముందే నేరాలు కట్టడి చేయాలని ప్రజలు వాపోతున్నారు.

**పని ఒత్తిడి భరించలేక...**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనాభా సుమారు 5లక్షల వరకు ఉండగా దమ్మాయిగూడ, సాకేత్, బాలాజీనగర్, యాప్రాల్, అంబేద్కర్ నగర్ ఐదు సెక్టార్లు ఉన్నాయి. ప్రజలకు సేవలు అందిచడంలో పోలీసుల కొరతతో ఉన్నవారికి పని ఒత్తిడి పెరిగి అనారోగ్యంతో బాధపడుతున్నారు. సరైన సమయంలో అక్రమ వ్యాపారాలు, అసాంఘిక ఘటనలు చోటుచేసుకుండా అడ్డుకోవాలంటే సరిపడు సిబ్బందిని కేటాయించాలి.

**నిత్యం 30-40 వరకు ఫిర్యాదులు...**

జవహర్ నగర్ శివారు ప్రాంతంలో ఉండటంతో వలసదారులు అధికంగా ఉంటారు. సుమారు నెలకు ఐదు వరకు హత్యలు జరుగుతాయంటే అతిశయోక్తి కాదు. ఆత్మహత్యలు, అదృశ్యం కేసులు చెప్పనక్కర్లేదు. నిత్యం 3040 వరకు ఫిర్యాదులు అందుతాయి. డ్యూటీల పేరుతో పోలీసులు బందోబస్తులు, ఉత్సవాలు, పార్టీ సభలకు ఇక్కడి నుంచే ఎస్సైలు వెళ్ళడంతో ప్రజలకు సేవలు అందడం లేదు. ఫిర్యాదు చేయడానికి వస్తే వారం రోజులు స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

**సిబ్బందిని కేటాయిస్తేనే ప్రజలకు న్యాయం...**

మినీ ఇండియాగా పేరుగాంచిన ఉమ్మడి జవహర్ నగర్ లో పేదలే ఎక్కువగా నివసిస్తున్నారు. పోలీస్ స్టేషన్ కు న్యాయం కోసం ప్రజలు వందల సంఖ్యలో వస్తుంటారు. ఎస్సైలు లేరు రేపుమాపు రావాలంటూ సిబ్బంది సమాధానం చెప్పడంతో చేసేదేమీలేక ఇంటిబాట పడుతూ ఛార్జీలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సత్వర సేవలు దక్కాలని ఇరువురు బాధితులు స్టేషన్కు వస్తే చెట్ల కింద పడిగాపులు కాయాల్సిందే. సీపీ మేడం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్కు డిటెక్టివ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ 1, ఎస్సైలు 4, పోలీసు కానిస్టేబుల్లు 30సిబ్బందిని కేటాయిస్తే ప్రజలకు పోలీసు సేవలు సత్వరం అందుతాయని ప్రజలు భావిస్తున్నారు.

# నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం

- **ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలి**
- **సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు**



**జూలూరుపాడు, మహా:**నిరుద్యోగ యువత జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని, దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఖాళీల భర్తీ, ఉద్యోగ హక్కు కోసం యువత సంఘటితం కావాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ జూలూరుపాడు మండల మహాసభ స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో చీమకుర్తి సంతోష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత ఉద్యోగాల భర్తీ పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు సకాలంలో పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగ్ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగ కల్పనను హక్కుగా కాకుండా ఎన్నికల హామీలకే పరిమితం చేస్తున్నాయని విమర్శించారు. స్థానిక ఉపాధి అవకాశాలు పెంచే పరిశ్రమలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు, యువజన సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె చాంద్ పాషా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, కొండా వీరయ్య, రమేష్, సుధా, ఎస్కె బోలేమియా, సతీష్, వంశీ, వెంకటేశ్వర్లు, సురేష్, నరేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు డీఎస్పీ ఆదేశం

**దమ్మపేట ,మహా :** ప్రతి గ్రామంలో సి.సి. కెమేరాలను ఏర్పాటు చేయించి తద్వారా క్రైమ్ రేట్ తగ్గించే దిశగా పోలీసులు విధులు నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని పాల్వంచ సబ్ డివిజన్ డియస్పి సతీష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానికంగా ఉన్న పోలీసు స్టేషన్ ను సందర్శించి మొక్కను నాటారు. ఈ సందర్భంగా పోలీసుల పనితీరు ను , క్రైమ్ వివరాలను , ఈ సాక్ష్య , ఆన్లైన్ ఎఫైఆర్ , పట్టుబడిన వాహనాల వివరాలను పరిశీలించారు. స్టేషన్ సిబ్బంది యొక్క మొత్తం సామాగ్రి ,కావాలసిన మౌలిక వసతులను గూర్చి వివరాలు సేకరించారు. ప్రతి గ్రామంలో సిసి కెమేరా లను ఏర్పాటు చేయించాలని ,గంజాయి వినియోగదారుల ను గుర్తించి వెంటనే వారిని కౌన్సెలింగ్ కేంద్రాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో అశ్వారావుపేట సిఐ నాగరాజు రెడ్డి , యస్సై .రాజేష్ కుమార్ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిసెలో మహిళ మృతదేహం

**కుషాయిగూడ, మహా:** జవహర్ నగర్ చెన్నాపురం సమీపంలోని భాగ్యనగర్ కాలనీ మెయిన్ రోడ్ లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం జవహర్ నగర్ లోని చెన్నాపురం సమీపంలోని భాగ్యనగర్ కాలనీ రహదారి పక్కన ఉన్న ఓ ఆయుర్వేద గుడిసెలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం రేపింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బందికి బుధవారం సుమారుగా రెండు గంటల సమయాన సురేష్ అనే వ్యక్తి పబ్లిక్ కాల్ ద్వారా సమాచారాన్ని అందించాడు. చెన్నాపురంలోని భాగ్యనగర్ కమాన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఆయుర్వేద వనమూలికలు అమ్ముకునే గుడిసెలో గుర్తు తెలియని మహిళ శవం పడి ఉండగా వెంటనే సమాచారం అందించాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తుతెలియని మహిళ మృతదేహం రోడ్డు పక్కన ఉన్న చిన్న టెంట్ కింద పడి ఉందని గుర్తించి మృతదేహం సుమారుగా నాలుగు నుండి ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లుగా నిర్ధారించారు. కుళ్ళిపోయి ఉబ్బిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి సదరు మహిళ అప్పటికే మృతి చెందినదిగా గుర్తించి సంఘటనా స్థలంలో స్థానిక ప్రజలను విచారించగా మృతురాలు గత కొంతకాలంగా పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ ఫుట్పాత్ పై నివసిస్తుండేదని తెలిసింది. అయితే ఆమె పూర్తి పేరు చిరునామా ఇతర వ్యక్తిగత వివరాలు తెలియ రాలేదు. ఈ మేరకు మృతురాలి ఇతర వివరాలు తెలియకపోవడంతో ఆమె మరణానికి గల కారణాలు మృతి చెందిన పరిస్థితులు వివరాలు తెలియాల్సి ఉంది కావున ఈ విషయమై కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# పెద్దిపల్లిలో జ్వర సర్వే

- **పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట..**
- **గ్రామంలో ఇంటింటి సర్వే.. వైద్య శిబిరం నిర్వహణ**



**మణుగూరు, మహా:** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన పెద్దిపల్లిలో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించారు. గృహాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వర్షాలతో నీరు కలుషితమై జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమతెరలు వినియోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. వలస ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారు ఆశ కార్యకర్తల ద్వారా రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం విజయనగరం గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనసూర్య, హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, ఆరోగ్య సిబ్బంది కృష్ణ, శైలజ, రోజా తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ఏఈ నరసింహ**

**వలిగొండ, మహా న్యూస్ :** వలిగొండ మండలంలో నేడు గురువారం రామన్నపేట ఈ హెచ్టి సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా రెడ్ల రేపాక దాసిరెడ్డిగూడెం వలిగొండ అక్కంపల్లి నాతాల గూడెం లింగరాజుపల్లి మల్లేపల్లి లోతుకుంట మాందాపురం నాగారం గొల్లెపల్లి జాలు కాలువ మరియు లక్ష్మాపురం పీడర్ పరిధిలోని వేములకొండ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు వేములకొండ వెంకటాపురం చిత్తాపురం ముద్దాపురం విద్యుత్ సరఫరా మధ్యాహ్న ఒంటిగంట నుండి ఐదు గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు సహకరించాలని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు



## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

**వలిగొండ ఆగస్టు 26మహా న్యూస్**

వలిగొండ మండలంలోని ఆరూరు గ్రామంలో నిరుపేద కుటుంబం రవ్వ సత్యం గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందడం జరిగింది మరణ వార్త తెలుసుకున్న అరూరు యాదవ సంఘం అధ్యక్షులు అలాగే మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి మాజీ డైరెక్టర్ కసర బోయిన లింగయ్య యాదవ్ పార్థివ దేహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించి ఆ కుటుంబానికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో చిమ్మయ్య ఆవుల స్వామి తుమ్మల సంతోష్ కాలే రామచందర్ రెబ్బాస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు



## కూతురు కనిపించడం లేదని ఫిర్యాదు

**దమ్మపేట ,మహా :** తన కన్నకూతురు గత నాలుగు రోజులుగా కనిపించడం లేదంటూ స్థానిక పోలీసు స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేసాడు ఓ తండ్రి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని అల్లిపల్లి గ్రామానికి చెందిన బెల్లం అఖిల (14) గత నాలుగు రోజులు గా కనిపించడం లేదని తండ్రి బెల్లం రవి ఫిర్యాదు చేశాడని యస్సై రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం

**ఆదిలాబాద్ మహా:** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. బుధవారం పట్టణంలోని STU భవన్‌లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ 80వ వార్షికోత్సవానికి ఆమె హాజరయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. గురువుల బోధనలు, నేర్పిన విలువల కారణంగా తాను ఈ స్థితిలో ఉన్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులే కాకుండా విద్యార్థుల భవిష్యత్తుకు శిల్పులని కొనియాడారు. STUTS వంటి ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం విద్యా రంగ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , సంఘం రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## మానవతా విలువలు యావత్ సమాజానికి శాశ్వత స్ఫూర్తిదాయకం

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్

**బెల్లంపల్లి, మహా:** ప్రవక్త మహమ్మద్ సల్లల్లా హు అలైహి వసల్లం మానవాళికి బోధించిన ప్రేమ, శాంతి, కరుణ, సోదరభావం, సమానత్వం, మానవతా విలువలు యావత్ సమాజానికి శాశ్వత స్ఫూర్తిదాయకంగాఉన్నాయని మిలాద్ఉన్‌నబీ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర మిలాద్ఉన్‌నబీ సందర్భంగా ప్రతి హృదయంలో శాంతి, ప్రతి కుటుంబంలో సంతోషం, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.జనరల్ సెక్రెటరీ దెబ్బటి రమేష్ , డిసిసి మెంబర్ జమ్మికుంట విజయ్,పట్టణ కార్యదర్శి ఏల్తూరి శంకర్,పట్టణ సెక్రెటరీ సాయి కిరణ్,నియోజకవర్గ సర్ కోఆర్డినేటర్ ఖాజాపాషా , పట్టణ వైస్ ప్రెసిడెంట్ వాజిద్ బాయ్ ,ఖలీల్, నాయకులు జావిద్ ఖాన్,ఎం డీ.అలీ భాయ్ పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు!

- శ్రీచక్ర కాలేజీలో టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా
- భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపి రాజు




**ఇబ్రహీంపట్నం ఆగస్టు 26 మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న నీట్ పరీక్షా కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను ఏసీపీ కేపీవీ రాజు బుధవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, శేరిగూడలోని శ్రీచక్ర కాలేజీలో టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో, ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నేపథ్యంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మద్ది మహేందర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి సిబ్బందితో కలిసి శ్రీచక్ర కాలేజీలోని టీసీఎస్ ఐఓఎన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని సీసీటీవీ కెమెరాల పనితీరు, పార్కింగ్ ఏర్పాట్లు, కేంద్రంలోకి వచ్చిపోయే మార్గాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులతో పాటు వారితో వచ్చే తల్లిదండ్రులకు కూడా పరీక్ష పూర్తయ్యే వరకు అవసరమైన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నీట్ పీజీ ప్రవేశ పరీక్షను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇబ్రహీంపట్నం పోలీసులు అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహాధర్నా.. ఉద్యోగులారా కదలిరండి!

- అడుక్కుంటే హక్కులు అసాధ్యం
- పోరాటాలతోనే అవి సాధ్యం!
- ఉద్యోగుల జెఏసి రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 26 మహా:** ఉద్యోగుల హక్కుల సాధన కోసం నగరంలోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న, మహాధర్నా విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ అన్నారు. అడుక్కుంటే హక్కులు అసాధ్యం పోరాటాలతోనే అవి సాధ్యం! అనే నినాదంతో, నేడు గురువారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న మహాధర్నకు, రంగారెడ్డి జిల్లా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు అందరూ తప్పక పాల్గొని, ఈ యొక్క ధర్నాను జయప్రదం చేయాలని, రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తమ యొక్క హక్కులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు.



# కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యుడిపై ధరల భారమా..?

- ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు

**సత్తుపల్లి, మహా** : కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల పన్ను రాయితీలు, సబ్సిడీలు, ఉచిత భూములు కల్పిస్తూ.. సామాన్య ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల భారాన్ని మోపడం దారుణమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు ప్రభుత్వ తీరును విమర్శించారు. సత్తుపల్లి పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సమావేశం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాండురంగారావు మాట్లాడుతూ.. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకరించే విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు. ఒకవైపు నిరుద్యోగం, ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల రుణమాఫీలు చేయడం ప్రజావ్యతిరేక చర్య అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు గతంలో సులభంగా విద్యనభ్యసించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం విద్యను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల ఫీజులను నియంత్రించి, కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే ప్రభుత్వాలు పనిచేస్తే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పెరిగిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రజల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని పాండురంగారావు హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రావుల రాజబాబు, చావా రమేష్, మోరంపూడి వెంకట్రావు, చెరుకు రత్నకుమారి, గుదే రాము, చప్పిడి భాస్కర్, చెరుకు శ్రీనివాస్, పుష్పవల్లి, వెంకటేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమేష్**




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ అన్నారు. బుధవారం బూడిదిగడ్డ ఉన్నత పాఠశాలలో సిపిఎం ప్రతినిధులు సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు బాత్రూమ్స్ టాయిలెట్స్ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లే గ్రౌండ్ ఉన్నప్పటికీ వర్షాకాలంలో వరద నీరు నిలవడం వల్ల ఆడుకోలేని స్థితి ఏర్పడిందని అన్నారు. మూత్రశాలల వద్ద బయటికి పోతున్న నీరు వల్ల దుర్గంధంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం పాఠశాల అధ్యాపకులకు ప్రజలకు ఘర్షణలు అవుతున్నాయని ఈ సర్వేలో వాస్తవాలు బయట పడ్డాయి అన్నారు. పేద విద్యార్థులు కష్టపడి చదువుతున్న సమయంలో ఇటువంటి సమస్యల సుడిగుండంలో ఎలా చదువుకుంటున్నారని అర్థంకాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. ప్రజాప్రతినిధులు స్థానిక కార్పొరేటర్ దృష్టికి మరి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన ఉండటం లేదని సర్వేలో వాస్తవాలు బయటికి వచ్చాయని రమేష్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేసిన ఓట్లతో గెలిచిన పాలకవర్గాలు ప్రజాప్రతినిధులు విద్యార్థుల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకొని వారి ఆరోగ్యాలు చదువు నడవడిక కూడా అభివృద్ధి పదంలో నడిపించాల్సిన గురు తల బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని రమేష్ అన్నారు. మూత్రశాలలు బాత్రూమ్స్ వల్ల వస్తున్న దుర్గంధం బయట సరైనటువంటి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ దుర్గంధంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెంటనే నిధులు కేటాయించి సౌకర్యాలను మెరుగు పరచాలని సీపీఎం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఇదే పద్ధతిలో విద్యార్థుల పట్ల ప్రభుత్వ పాఠశాల పట్ల నిర్లక్ష్యం వాయిస్తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాడుగుల ప్రభాకర్, రాజ్ కుమార్, స్వచ్ఛ మిత్రా నాయకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి :ఎస్పీ




**ఆదిలాబాద్ మహా:** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో పాటు జిల్లా ప్రజలందరికీ మిలాద్ ఉన్ నబీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.పండుగ సందర్భంగా పట్టణంలో నిర్వహించే ర్యాలీలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ర్యాలీ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి, శాంతిభద్రతలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ శాంతి, సోదరభావం, సామరస్యంతో పండుగను జరుపుకోవాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఓనం ఉత్సవాలు

- కలెక్టర్ ,ఎస్పీ, మున్సిపల్ చైర్ పర్సన్ హాజరు



**ఆదిలాబాద్ మహా:** కేరళ తరహాలోనే బెల్లూరి అయ్యప్ప ఆలయం వద్ద ఓనం మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాదు గ్రామీణ మండలం బెల్లూరి అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన ఓనం వేడుకలకు కలెక్టర్, ఎస్పీ అఖిల్ మహాజన్ , మున్సిపల్ చైర్మన్ బండారి అనూష లు వేర్వేరు సమయాలలో హాజరై పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కేరళలో ఏ విధంగా ఓనం పండుగ జరుగుతుందో, అదే రీతిలో అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమం, అభిషేకం, దీక్షా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారని తెలిపారు. గత 25 సంవత్సరాల నుంచి ఈ టెంపుల్ చరిత్ర కొనసాగుతోందని, దేశవ్యాప్తంగా ఓనం పండుగను జరుపుకున్నట్లే మన జిల్లాలో సైతం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది తాను ఓనం పండుగలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. భగవంతుని దర్శనం చేసుకుని, ఆశీస్సులు తీసుకుని జిల్లా అన్ని రంగాల్లో మరింత ముందుకు వెళ్లేందుకు, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, చదువులోనూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, భగవంతుడు అందరికీ శక్తినివ్వాలని కోరారు. అదేవిధంగా ఆలయానికి సంబంధించి గత సంవత్సరంలో ఉన్న పెండింగ్ పేమెంట్స్, బిల్స్ అన్నీ క్లియర్ చేసుకుని, మరిన్ని వసతులు సమకూర్చుకుంటూ ఈసారి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఓనం పండుగను మరింత ఘనంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు .ఓనం పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతియుత వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి రమేష్, గురుస్వాములు గొర్ల కృష్ణ, చంద్ర గణేష్, తిప్పరి సత్యం, గాలి లక్ష్మి, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పండ్ల పంపిణీ

**బెల్లంపల్లి, మహా:** మిలాద్ఉన్‌నబీ సందర్భంగా తాజ్ బాబా సేవా సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి గురుకుల హాస్టల్ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కన్వీనర్ నాథరి స్వామి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో చదువుకోవాలని, జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమితి అధ్యక్షుడు ఉస్మాన్‌ను అభినందించారు.




## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

**సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**

**భద్రాద్రి, కొత్తగూడెం, మహా:** పాత కొత్తగూడెం పరిధిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. సిపిఎం పాత కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను బుధవారం అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా లిక్కి బాలరాజు మాట్లాడుతూ ప్రధానంగా పాత కొత్తగూడెం పరిధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని డ్రైనేజీలు సక్రమంగా తీయకపోవడం వలన చెత్త మురుగునీరు పేరుకుపోయి దోమలు విపరీతంగా వస్తున్నాయని తెలిపారు. దోమ కాటు వలన ప్రజలకు మలేరియా డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని అందుకని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. కిన్నెరసాని మంచినీరు ప్రతిరోజు రాకపోవడం వలన మంచినీళ్లకు కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోతులు వీధి కుక్కల బెడద వలన ప్రజలు ఇళ్లలోంచి బయటికి రావడానికి భయపడుతున్నారని అందుకని కోతులు వీధి కుక్కలను పట్టించి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు మంద నాగకృష్ణ నాయకులు ఎస్కే సాహిబి కల్లాకుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షాబంధన్ – అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక



**క్యాతనపల్లి మహా :** అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ రక్షాబంధన్. ప్రతి సంవత్సరం శ్రావణ మాస పౌర్ణమి రోజున ఈ పండుగను దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ రోజున సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి క్షేమాన్ని ఆకాంక్షిస్తారు. సోదరులు తమ సోదరీమణులకు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తూ బహుమతులు అందజేస్తారు.రాఖీ కట్టడం వెనుక కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాకుండా, కుటుంబ బంధాలను మరింత బలపరిచే గొప్ప సందేశం ఉంది. చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని ఈ పండుగ మరోసారి గుర్తు చేస్తుంది. ఉద్యోగాలు, చదువులు, వివాహాలు, జీవన పరిస్థితుల కారణంగా దూరంగా ఉన్న సోదరసోదరీమణులు సైతం ఈ రోజున ఒకరినొకరు కలుసుకుని ప్రేమాభిమానాలను పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**మారుతున్న కాలంలోనూ మారని అనుబంధం**

ఆధునిక జీవనశైలి, ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య సమయం తగ్గిపోతున్నప్పటికీ రక్షాబంధన్ వంటి పండుగలు బంధాలను గుర్తు చేస్తూ కుటుంబ సభ్యులను ఒక్కచోట చేర్చుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లలో వివిధ రకాల రంగురంగుల రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. పిల్లల కోసం కార్టూన్ పాత్రలతో కూడిన రాఖీలు, యువత కోసం ఆకర్షణీయమైన డిజైన్లతో కూడిన రాఖీలు ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు.సాంకేతికత పెరిగిన నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులకు వీడియో కాల్స్, ఆన్‌లైన్ ద్వారా రాఖీలు, బహుమతులు పంపడం కూడా సాధారణమైంది. అయితే రాఖీ విలువ దాని ధరలో కాకుండా, దానిని కట్టే చేతుల్లోని ప్రేమలో ఉందని పెద్దలు చెబుతున్నారు.

**బంధాలకు బలాన్నిచ్చే పండుగ**

రక్షాబంధన్ కేవలం సోదరుడి రక్షణకు సంబంధించిన పండుగగా మాత్రమే కాకుండా పరస్పర ప్రేమ, గౌరవం, బాధ్యతలకు ప్రతీకగా భావించాలి. సోదరసోదరీమణులు జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలవాలనే సంకల్పాన్ని ఈ పండుగ గుర్తుచేస్తుంది.కుటుంబ విలువలు, సంప్రదాయాలు, ఆత్మీయతలు క్రమంగా తగ్గుతున్న ఈ కాలంలో రక్షాబంధన్ వంటి పండుగల ప్రాధాన్యత మరింత పెరిగింది. బంధాలను కాపాడుకోవడం, కుటుంబ సభ్యుల పట్ల ప్రేమాభిమానాలను వ్యక్తపరచడం, ఒకరికొకరు తోడుగా నిలవడం ద్వారా ఈ పండుగ అసలైన స్ఫూర్తిని కొనసాగించవచ్చు. రాఖీ కేవలం దారం కాదు. అది ప్రేమ, నమ్మకం, అనుబంధానికి ప్రతీక.

## ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులుగా బరగడ రమేష్, చల్లగుండ్ల సతీష్




**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల ఏఐవైఎఫ్ నూతన కమిటి ఎన్నిక జరిగింది. బుధవారం మండల కేంద్రంలోనీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన మహాసభలో నూతన అధ్యక్ష, కార్యదర్శుల తోపాటు కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గా భగత్ సింగ్ కాలనీకి చెందిన బరగడ రమేష్, కార్యదర్శి గా వెంగన్నపాలెం గ్రామానికి చెందిన చల్లగుండ్ల సతీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల సహాయ కార్యదర్శులుగా చీమకుర్తి సంతోష్, అనుమల అశోక్, ఎస్కే బోలెమీయ, ఉపాధ్యక్షులుగా పది మల్ల రామకృష్ణ, కోటె నరేష్, చాట్ల రామనాథం, తోపాటు 13 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యాన్ని పెంపొందించాలి

- మంత్రి కొండా సురేఖ
- భక్తుల విశ్రాంతి గదులను ప్రారంభించిన మంత్రి

**వరంగల్, బ్యూరో మహా;** మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం వరంగల్ నగరంలోని ఉర్సు దర్గా, పోచమ్మ మైదాన్ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు కీర్ పాయసాన్ని పంపిణీ చేశారు. అలాగే ఉర్సు దర్గా కు వచ్చే భక్తులకు కొరకు నిర్మించిన విశ్రాంతి గదులను మంత్రి సురేఖ ప్రారంభించారు.ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవతా విలువలను బోధించారని అన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, కులమత సామరస్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ ఐక్యంగా జీవించడమే మహమ్మద్ ప్రవక్త బోధనల సారాంశమని మంత్రి పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రజలందరిలో ప్రేమ, సోదరభావం, మానవతా దృక్పథాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంధాలయ చైర్మన్ మీసాల ప్రకాష్ , ముస్లిం మత పెద్దలు, గురువులు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్ , ముఖ్య నాయకులు సయ్యద్ వసీం, బూర సురేష్, మబ్బు ప్రవీణ్, కురిమిల్ల సంపత్ కుమార్, చిట్టి మల్ల రమేష్‌బాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్సీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ

- వైద్యులు, సిబ్బంది అంకితభావంతో వైద్య సేవలందించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, రాయపర్తి మహా ;** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పల్లె దవాఖానా లో వ్యాధి నిరోధక టీకా లు చిన్నారులకు వేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఆసుపత్రిలోని మందుల నిల్వలను తనిఖీ చేసి, గడువు తీరిన మందుకు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మందులను సురక్షితంగా భద్రపరిచే తీరును పరిశీలించారు.ల్యాబొరేటరీ లో మందుల నిలువ, ఇతర వైద్య సామగ్రి గురించి ల్యాబ్ ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు.ల్యాబొరేటరీని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ల్యాబ్ ఇన్‌చార్జిని కలెక్టర్ ఆదేశించారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి సమస్యలతో వచ్చిన పేషెంట్స్ తో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి మాటల్లో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి వారి మాటల్లో తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్,సంబంధిత గ్రామ సర్పంచ్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురు తెలంగాణ యువకుల దుర్మరణం

**మహా :** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోరిడా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మరణించిన వారిలో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ అనే యువకుడు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉన్నత భవిష్యత్తు లక్ష్యంతో రాహుల్ కేవలం మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. అక్కడ ప్రయాణిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు ప్రాణాలు కోల్పోవడంతో స్వగ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. అమెరికా వెళ్లి కొద్దిరోజులకే రాహుల్ మృతి చెందాడనే వార్త వినడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ప్రమాదం ఏ వాహనంలో ప్రయాణిస్తున్నప్పుడు జరిగింది, అసలు ప్రమాదానికి గల కారణాలేమిటనే కోణంలో స్థానిక అమెరికన్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు

# పాత శివాలయ అభివృద్ధికి అండగా ఉంటా

## ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ, మహా :** విజయవాడలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం (పాత శివాలయం)కు ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బుధవారం పాత శివాలయం నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, నాగుల్ మీరా, జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయవాడ నగర అభివృద్ధి క్రమంలో పాత శివాలయానికి ప్రత్యేక స్థానం ఉందని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఈ ఆలయం వెలసిన అనంతరం విజయవాడ అభివృద్ధి మరింత వేగం పుంజుకుందని గుర్తుచేశారు. దేశ, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై నూతన ధర్మకర్తల మండలి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.

**ఆటోనగర్ అభివృద్ధికి ఐలా కీలకం**

అనంతరం విజయవాడ ఆటోనగర్ ఐలా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బుద్ధా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఆటోనగర్ ఐలా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. సుమారు లక్ష మంది కార్మికులు నివసించే ఈ ప్రాంతంలో ఐలా కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.గత ఐలా కమిటీ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. గత రెండేళ్లుగా ఐలా ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ పోరాటం చేశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎన్నికల నిర్వహణ కోసం నిరంతరం కృషి చేశామని వివరించారు. ఐలా ఎన్నికలు నిర్వహించాలంటే కలెక్షన్లు 60 శాతానికి పైగా ఉండాలని అధికారులు నిర్దేశించారని, అందరూ సమన్వయంతో పనిచేసి ఆ లక్ష్యాన్ని సాధించడంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోగలిగామని తెలిపారు.ప్రశాంత వాతావరణంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులకు కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. అధ్యక్షుడిగా శివనాగేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీగా కలామ్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారందరూ ఆటోనగర్ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని సూచించారు.

**ఆటోనగర్ సమస్యలు ఐలానే పరిష్కరించాలి**

విజయవాడకు ఆటోనగర్ జీవనాడి వంటిదని ఎంపీ అన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సమస్యలు ఉంటే వాటిని ఐలా ముందుండి పరిష్కరించేలా నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సహకారం అవసరమైన సందర్భాల్లో తమ దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఆటోనగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సీఆర్‌డీఏలో పోరాడి మూడు రోడ్లకు టెండర్లు పూర్తి చేయించామని కేశినేని శివనాథ్ తెలిపారు. ఇప్పటికే ఆయా రోడ్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నాలుగో రోడ్డును ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రారంభించారని, శక్తి కల్యాణ మండపం రోడ్డు కూడా సిద్ధమైందని వెల్లడించారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

- వన్ నేషన్–వన్ ఎలక్షన్'కు వ్యతిరేకం.
- ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు.



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో భూ సమస్యలకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి విధానమే ప్రధాన కారణమని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ఆరోపించారు. భూములకు సంబంధించిన సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గతంలో ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములు సైతం తిరిగి అక్రమ రిజిస్ట్రేషన్లకు గురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చోటుచేసుకుంటున్న తప్పిదాలపై రెవెన్యూ శాఖ అప్రమత్తంగా వ్యవహరించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొని ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రగతిభవన్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పాలకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లేకుండా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా రూపొందించిందని తెలిపారు. అదే తరహాలో గాంధీభవన్‌ను కూడా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే వేదికగా తీర్చిదిద్దేందుకు ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.బుధవారం తన దృష్టికి వచ్చిన అర్జీల్లో అత్యధికంగా భూములకు సంబంధించిన సమస్యలే ఉన్నాయని వీహెచ్ తెలిపారు. పాత పటేల్-పట్వారి వ్యవస్థలో భూ వ్యవహారాలపై స్థానిక స్థాయిలో స్పష్టమైన సమాచారం ఉండేదని, అందువల్ల సమస్యలు తక్కువగా ఉండేవని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో ప్రజలకు అనేక కొత్త సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. పేదలకు గతంలో పంపిణీ చేసిన భూములను తిరిగి కొందరు భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని చెప్పారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డుల పరిశీలన, భూముల హక్కుల నిర్ధారణలో మరింత జాగ్రత్త అవసరమని వీహెచ్ అన్నారు. పేదల భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. భూ రికార్డుల్లో తప్పులు, అక్రమ బదలాయింపులు, రిజిస్ట్రేషన్లలో అవకతవకలపై సమగ్రంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' విధానంపైనా వీహెచ్ తీవ్రంగా స్పందించారు. దేశంలోని భిన్న సామాజిక, మత, కుల నేపథ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. అమెరికా తరహా ఎన్నికల విధానాన్ని భారత్‌లో అమలు చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్న సంబంధాల నేపథ్యంలో భారత్‌ను కూడా అమెరికా తరహాలో మార్చాలని చూస్తున్నారంటూ ఆయన విమర్శించారు.భారత్ భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగిన సెక్యులర్ దేశమని, ఇక్కడ అనేక మతాలు, కులాలు, ప్రాంతాలు ఉన్నాయని వీహెచ్ పేర్కొన్నారు. ఇలాంటి దేశంలో ఒకే ఎన్నికల విధానం అమలు చేయడం వల్ల అనేక వర్గాల ప్రయోజనాలకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా బీసీలకు న్యాయం జరిగేలా ముందుగా కులగణన, ప్రాతినిధ్యం వంటి అంశాలను స్పష్టంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కులగణనలో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' గురించి మాట్లాడటం ఎలా సమంజసమని వీహెచ్ ప్రశ్నించారు. దేశ జనాభాలో బీసీలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి తగిన ప్రాతినిధ్యం, హక్కులపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. ''మేము వన్ నేషన్-వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం'' అని ఆయన స్పష్టం చేశారు.కులగణన పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోందంటూ వీహెచ్ ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్ల సంఖ్యకు, ఎన్నికల సంఘం లెక్కలకు మధ్య తేడా ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలపై సమగ్ర పరిశీలన జరిపి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని వీహెచ్ సూచించారు.

## మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత

# సమాజానికి సంఘమిత్రలు

- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి మహిళ భాగస్వామ్యం కావాలి
- 112కు సమాచారం ఇవ్వండి.. యువత భవిష్యత్తును కాపాడండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్
- జనగామ ను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**జనగామ మహా :** మాద కద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలను, పట్టణాలను కూడా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే "సంఘమిత్ర"గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ పిలుపునిచ్చారు.బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు "సంఘమిత్ర - మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు"ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాయని, గర్భిణీలకు పోషకాహారం అందించడం నుంచి చిన్నారులకు మధ్యాహ్న భోజనం, అక్షరాస్యత, కుటుంబ సంక్షేమం, సామాజిక ఆడిట్ వంటి అనేక కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పని చేస్తున్నారన్నారు.జనగామ జిల్లాలో మహిళల చైతన్యం ప్రత్యేకమని పేర్కొంటూ, ఆ చైతన్యాన్ని సమాజ భద్రత కోసం వినియోగించాలని కోరారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 26 లక్షల జనాభాకు కేవలం 3 వేల మంది పోలీసు సిబ్బంది మాత్రమే ఉన్నారని, అందువల్ల మహిళా సంఘాల సహకారం అత్యంత అవసరమని వివరించారు.పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ వ్యసనం అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణలో అలాంటి పరిస్థితి రాకుండా ఇప్పుడే సమిష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు.యువతే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి మహిళా సంఘం బాధ్యత అని స్పష్టం చేశారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల దుష్ప్రభావం వెంటనే కనిపించకపోయినా కొంతకాలానికి మెదడు, నరాల వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని నేరస్తులుగా చూడడం సరికాదని, వారికి చికిత్స అందించి, తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలు సామాజిక మార్పుకు బలమైన వేదికలుగా ఉన్నాయని, పోలీస్ శాఖలో ఉన్న పరిమిత సిబ్బందితో పోలిస్తే మహిళా సంఘాల ద్వారా లక్షలాది మందికి అవగాహన కల్పించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయాలు, రవాణా (లేదా) వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే 112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు అవసరమైతే బహుమతులు కూడా అందజేస్తామని వెల్లడించారు. పదో తరగతి లేదా ఇతర తరగతుల విద్యార్థులు అకస్మాత్తుగా పాఠశాలకు రాకపోవడం, తల్లిదండ్రుల మాట వినకపోవడం, అనుమానాస్పదంగా ప్రవర్తించడం వంటి అంశాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సంఘమిత్ర కార్యక్రమం ఒక రోజుతో ముగిసేది కాదని, ఇకపై మండల సమాఖ్యలు, జిల్లా సమాఖ్యల సమావేశాల్లో పోలీసు అధికారులు క్రమం తప్పకుండా పాల్గొని, డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు మహిళా సంఘాలే ప్రధాన శక్తిగా నిలవాలన్నారు. జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఉన్నారని, వీరి ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లవచ్చని చెప్పారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాల్లో గృహ హింస, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ మహిళా సంఘాలు, సంఘ సమాఖ్యలు, కాలనీ సమావేశాల్లో చర్చించి, యువతను మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ..జనగామ జిల్లా మహిళా సంఘాలు రాష్ట్రంలోనే అత్యంత చైతన్యవంతమైన సంఘాలుగా గుర్తింపు పొందాయన్నారు. డ్రగ్స్ మొదట సరదాగా ప్రారంభమై చివరకు ప్రాణాంతక వ్యసనంగా మారుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఆలస్యంగా ఇంటికి రావడం, రాత్రిళ్లు మేల్కొని ఉండడం, కొత్త స్నేహాలు, చేతులపై ఇంజెక్షన్ గుర్తులు, పెదాలు నల్లబడటం వంటి లక్షణాలను గమనించాలని సూచించారు. సమస్యను దాచిపెట్టకుండా వెంటనే పోలీసులకు (లేదా) డీఅడిక్షన్ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అమలులో ఉన్న ఎన్‌డీపీఎస్ చట్టం-1985 ప్రకారం గంజాయి సేవించడం, విక్రయించడం, రవాణా చేయడం, దాచిపెట్టడం వంటి నేరాలకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని వివరించారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల పై కూడా తీవ్ర ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు.

# థిక్స్ కమిటీకి బీఆర్ఎస్ కొత్త అస్త్రం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ వ్యవహారం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో వేడి పెంచుతోంది. హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలను పరిశీలించేందుకు ఈ నెల 29న కమిటీ సమావేశం కానుంది. అయితే కౌశిక్‌రెడ్డి వ్యవహారానికే విచారణను పరిమితం చేయకుండా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చేసినట్లు తాము పేర్కొంటున్న వ్యాఖ్యలు, ప్రవర్తనపైనా విచారణ జరపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. దీంతో ఎథిక్స్ కమిటీ సమావేశం అధికార, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ పోరాటానికి వేదికగా మారే అవకాశం కనిపిస్తోంది.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 29న జరిగే ఎథిక్స్ కమిటీ సమావేశానికి బీఆర్ఎస్ హాజరవుతుందని, అయితే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని మాత్రమే విచారించడం సరికాదని అన్నారు. సభలో అధికార పార్టీ సభ్యుల ప్రవర్తనను కూడా సమానంగా పరిశీలించాలని కోరనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ముందుగా ప్రశ్నించి, అనంతరం కౌశిక్‌రెడ్డి కేసును పరిశీలించాలని బీఆర్ఎస్ పట్టుబట్టనుంది.కౌశిక్‌రెడ్డి కేసుకు మార్చిలో జరిగిన అసెంబ్లీ పరిణామాలు నేపథ్యంగా ఉన్నాయి. మైనింగ్ అక్రమాలపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో కౌశిక్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరు సభా మర్యాదలకు విరుద్ధంగా ఉందన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ వ్యవహారాన్ని అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి అప్పగించారు. అనంతరం అధికార కాంగ్రెస్ సభ్యులు కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా.. బీఆర్ఎస్ మాత్రం తమ ఎమ్మెల్యేను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించింది.ఇప్పుడు ఈ కేసును బీఆర్ఎస్ మరో కోణంలో ముందుకు తీసుకెళ్తోంది. 'కౌశిక్‌రెడ్డి మాత్రమే ఎందుకు?' అనే ప్రశ్నను లేవనెత్తుతూ.. సభలో అధికార పార్టీ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనను కూడా అదే ప్రమాణాలతో పరిశీలించాలని కోరుతోంది. సభా నిబంధనలు అధికార, ప్రతిపక్షాలకు వేర్వేరుగా ఉండకూడదని ఆ పార్టీ వాదిస్తోంది. అనుచిత భాష, బెదిరింపుల ధోరణి ఎవరి నుంచి వచ్చినా ఒకే విధంగా పరిగణించాలని డిమాండ్ చేస్తోంది.వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎథిక్స్ కమిటీ రాజకీయ కమిటీగా మారకూడదని వ్యాఖ్యానించారు. కౌశిక్‌రెడ్డి కేసును పరిశీలించే ముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలు, ప్రవర్తనపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే మండల శామ్యూల్, మంత్రి పొన్నం ప్రభాకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరుల వ్యాఖ్యలను కూడా ప్రస్తావించారు. ఈ ఆరోపణలను ఎథిక్స్ కమిటీ ముందు ఉంచుతామని బీఆర్ఎస్ చెబుతోంది.అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలేనని, వాటిపై కమిటీ స్వతంత్రంగా పరిశీలన జరపాల్సి ఉంటుందని గమనించాలి. ఒక నాయకుడు ఆరోపణ చేయడం, ఆ ఆరోపణలు సభా నిబంధనలను ఉల్లంఘించినట్లు అధికారికంగా నిర్ధారించడం వేర్వేరు అంశాలు. అందువల్ల కమిటీ ముందు సమర్పించే ఆధారాలు, సభా రికార్డులు, వ్యాఖ్యల స్వభావం కీలకంగా మారనున్నాయి.మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులపై చేసినట్లు బీఆర్ఎస్ పేర్కొంటున్న వ్యాఖ్యలను కూడా కమిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి సహా అధికార పక్ష సభ్యుల వ్యాఖ్యలను పక్కనపెట్టి కేవలం ప్రతిపక్ష ఎమ్మెల్యేపై చర్య తీసుకుంటే సమాన న్యాయం జరగదని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పక్ష సభ్యులపై వచ్చిన ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది.కౌశిక్‌రెడ్డి వ్యవహారం చోటుచేసుకున్న సమయంలో మైనింగ్ అంశం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మైనింగ్ అక్రమాలపై బీఆర్ఎస్ నేతలు గతంలో ఆరోపణలు చేయగా.. ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. అసెంబ్లీలో ఈ అంశంపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. ప్రభుత్వం మాత్రం సీఐడీ విచారణ ఇప్పటికే కొనసాగుతోందని తెలిపింది. అదే సమయంలో కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి మధ్య వాగ్వాదం జరగడంతో మైనింగ్ అంశం కాస్తా సభా ప్రవర్తన, క్రమశిక్షణ అంశంగా మారింది.తాజాగా బీఆర్ఎస్ మళ్లీ ఆ రాజకీయ నేపథ్యాన్ని తెరపైకి తీసుకువస్తోంది. కౌశిక్‌రెడ్డి కేసుతో పాటు మైనింగ్, అవినీతి, భూములు, హైడ్రా, ఫ్యూచర్ సిటీ తదితర అంశాలపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను కూడా ప్రస్తావించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈ అంశాలన్నీ ఎథిక్స్ కమిటీ పరిధిలోకి వస్తాయా లేదా అన్నది ప్రశ్నగా మారింది. కమిటీ ప్రధానంగా సభ్యుల సభా ప్రవర్తన, సభా మర్యాద, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలనే పరిశీలించే అవకాశం ఉంది.కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని ప్రభుత్వం ప్రధాన రాజకీయ అంశంగా మార్చి అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. 22ఏ భూములు, భూ రికార్డులు, హైడ్రా, భవిష్యత్ నగర ప్రాజెక్టులు, మంత్రులపై వచ్చిన ఆరోపణలు వంటి అంశాలపై అసెంబ్లీలో విస్తృత చర్చ జరగాలని ఆ పార్టీ కోరుతోంది. అయితే కాంగ్రెస్ మాత్రం ఎమ్మెల్యే సభా ప్రవర్తనపై జరిగే విచారణను ఇతర రాజకీయ అంశాలతో ముడిపెట్టడం సరికాదని వాదించే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ ప్రధానంగా సభ్యుల ప్రవర్తన, సభా మర్యాద, పార్లమెంటరీ ప్రమాణాలను పరిశీలించే సంస్థ. సభ్యుడు సభలో అనుచితంగా ప్రవర్తించాడా? నిబంధనలను ఉల్లంఘించాడా? తోటి సభ్యుడి హక్కులు లేదా సభ గౌరవాన్ని దెబ్బతీశాడా? వంటి అంశాలను పరిశీలిస్తుంది. కాబట్టి కౌశిక్‌రెడ్డి కేసులో ఆయన ప్రవర్తనపై వచ్చిన ఆరోపణలే ప్రధానంగా పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది.అయితే బీఆర్ఎస్ తాజాగా లేవనెత్తుతున్న అధికార పక్ష సభ్యుల అంశాలు కూడా సభా ప్రవర్తనకు సంబంధించినవిగా ఉంటే వాటిని కమిటీ ఎలా స్వీకరిస్తుందన్నది కీలకంగా మారింది. కమిటీ అందరికీ ఒకే ప్రమాణం వర్తింపజేస్తే బీఆర్ఎస్ వాదనకు బలం చేకూరుతుంది. కేవలం కౌశిక్‌రెడ్డి కేసుకే విచారణను పరిమితం చేస్తే.. దానిని రాజకీయ వివక్షగా బీఆర్ఎస్ ప్రచారం చేసే అవకాశం ఉంది.



మహా పత్రిక





# సముద్ర తీరంలో జ్యోతి గ్లామర్

**సినీ నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్)** సోషల్ మీడియాలో మరోసారి సందడి చేస్తున్నారు. సముద్ర తీరంలో తీసుకున్న తాజా ఫొటోల్లో ఆమె ఎంతో గ్లామరస్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. పింక్ కలర్ ఫ్లోరల్ బికినీతో పాటు షీర్ కవర్‌అప్ ధరించి, కళ్లకు సన్‌గ్లాసెస్ పెట్టుకుని, సముద్రపు అలల మధ్య జుట్టును వదిలేసి ఇచ్చిన పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఫొటోలు చూసిన అభిమానులు ఆమె గ్లామర్‌తో పాటు స్టైలిష్ లుక్‌ను ప్రశంసిస్తున్నారు.కర్ణాటకలోని మడికేరికి చెందిన జ్యోతి పూర్వాజ్ తొలుత కన్నడ టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టారు. 'జోగుల' సీరియల్‌లో దేవకి పాత్రతో పాటు 'కిన్నరి', 'మూరు గంటు' వంటి సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే తెలుగువారికి మాత్రం 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో మరింత దగ్గరయ్యారు. ఇందులో జగతి పాత్రలో ఆమె చూపించిన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. బలమైన భావోద్వేగాలతో కూడిన ఆ పాత్ర ఆమెకు ప్రత్యేకమైన అభిమానులను సంపాదించి పెట్టింది.

టెలివిజన్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తర్వాత జ్యోతి సినిమాల వైపు అడుగులు వేశారు. తులు, కన్నడ చిత్రాలతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. 'బంగార్ద కురల్' (2012), 'మడిపు' (2017) వంటి చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత 'డియా' (2020), 'జెర్సీ నంబర్ 10' (2023), 'సప్లయర్ శంకర' (2024) తదితర సినిమాల్లో కనిపించారు. విభిన్న భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన పరిధిని క్రమంగా పెంచుకుంటున్నారు.ప్రస్తుతం జ్యోతి పూర్వాజ్ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బహుభాషా సూపర్‌హీరో చిత్రంగా తెరకెక్కుతున్న 'మాస్టర్‌పీస్'లో ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'కిల్లర్'లోనూ కనిపించనున్నారు. ఈ సినిమాను ఆమె భర్త సుకు పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్‌ఆర్', 'కిల్లర్: డ్రీమ్ గర్ల్' పేర్లతోనూ ఈ చిత్రానికి ప్రచారం జరుగుతోంది. ఇందులో జ్యోతి పలు కోణాలతో కూడిన విభిన్న పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం.'హల్కా డాన్' వంటి మరికొన్ని ప్రాజెక్టులతోనూ జ్యోతి పేరు వినిపిస్తోంది. టెలివిజన్ నుంచి సినిమాల వైపు అడుగులు వేసిన ఆమె ప్రస్తుతం గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన ఫొటోలు, వ్యక్తిగత అప్‌డేట్స్‌ను అభిమానులతో పంచుకుంటున్నారు. దీంతో జ్యోతి పూర్వాజ్‌కు సంబంధించిన ప్రతి కొత్త ఫొటో, సినిమా అప్‌డేట్ సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# నాగార్జున 100వ సినిమాపై భారీ అంచనాలు

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 100వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. యువ దర్శకుడు రా కార్తీక్ ఈ చిత్రంతో దర్శకుడిగా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు.నాగార్జున పుట్టినరోజు ఆగస్టు 29 సందర్భంగా సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. ఆ రోజున మూవీ టైటిల్ గ్లింప్స్‌ను అభిమానుల ముందుకు తీసుకురానున్నారు. నాగార్జున 100వ సినిమా కావడంతో టైటిల్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. పుట్టినరోజు కానుకగా వచ్చే గ్లింప్స్‌పై ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ అంచనాలు కనిపిస్తున్నాయి.ఈ సినిమాలో నాగార్జునతో పాటు సీనియర్ హీరోయిన్ టబు కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. గతంలో 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జున, టబు జోడీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. చాలా కాలం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ తెరపై కనిపించనుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున, దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన పాటలు మంచి ఆదరణ పొందడంతో ఈ మూవీ ఆల్బమ్‌పై కూడా అంచనాలు పెరిగాయి. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది.ఆగస్టు 29న విడుదల కానున్న టైటిల్ గ్లింప్స్‌లో సినిమా టైటిల్‌తో పాటు ఇతర కీలక వివరాలను కూడా వెల్లడించే అవకాశం ఉంది. భారీ తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను కూడా మేకర్స్ అదే సమయంలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. నాగార్జున మైల్‌స్టోన్ మూవీ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది.





# 'ఓజీ'పై ఇమ్రాన్ హష్మి ఆసక్తికర వ్యాఖ్యలు

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో భారీ అంచనాలు ఏర్పరిచిన చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే పవన్ అభిమానుల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. సాధారణ ప్రేక్షకుల్లోనూ ఈ మూవీపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడి పాత్రలో కనిపించడం సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చింది. ఓమి పాత్రలో ఇమ్రాన్ తనదైన స్టైల్‌తో ఆకట్టుకున్నారు.అయితే సినిమా విడుదల సమయంలో ఇమ్రాన్ హష్మి 'ఓజీ' గురించి పెద్దగా మాట్లాడలేదు. సాధారణంగానే తన సినిమాల ప్రమోషన్‌కు దూరంగా ఉండే ఆయన మీడియా ఇంటర్వ్యూలకు కూడా పరిమితంగానే హాజరవుతుంటారు. తాజాగా మాత్రం 'ఓజీ' గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినిమా విడుదలై చాలా కాలం గడిచిన తర్వాత తన పాత్రపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇమ్రాన్ హష్మి నటించిన 'ఆవారాపన్ 2' మంచి ఓపెనింగ్స్‌తో దూసుకెళ్తున్న నేపథ్యంలో ఆయన వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఓ తమిళ క్రిటిక్‌తో జరిగిన ఇంటర్వ్యూలో 'ఓజీ' గురించి మాట్లాడారు. ఈ సినిమాలో నటించే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ముఖ్యంగా తెలుగు సినిమాలో నటిస్తానని తాను గతంలో ఎప్పుడూ ఊహించలేదని, అయితే 'ఓజీ' కథ, తన పాత్ర నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు తెలిపారు.దర్శకుడు సుజీత్ పనితీరుపై కూడా ఇమ్రాన్ ప్రశంసలు కురిపించారు. సుజీత్ ఎంతో ఎనర్జీతో, విభిన్నమైన ఆలోచనలతో సినిమా తెరకెక్కించారని పేర్కొన్నారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు పాత్రలను స్టైలిష్‌గా చూపించిన విధానం తనకు బాగా నచ్చిందన్నారు. 'ఓజీ'లో భాగం కావడాన్ని తాను ఎంతో ఆస్వాదించానని, ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిందని ఇమ్రాన్ చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా 'ఓజీ'కి సీక్వెల్ వచ్చే అవకాశాలపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. మొదటి భాగంలో ఇమ్రాన్ పోషించిన ఓమి పాత్రకు ముగింపు రావడంతో రెండో భాగంలో కొత్త విలన్ కనిపించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. దీంతో 'ఓజీ 2'లో ప్రతినాయకుడి పాత్రను ఎవరు పోషిస్తారన్నది కూడా అభిమానుల్లో ఆసక్తికర అంశంగా మారింది.

# నటి ఫిర్యాదుతో దర్శకుడు అరెస్ట్

హైదరాబాద్‌లో టాలీవుడ్ దర్శకుడు పవన్ సాధినేనిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఓ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశారని, వ్యక్తిగత విషయాల్లోనూ నమ్మించి దూరంగా ఉన్నారని నటి ఆరోపించినట్లు సమాచారం. కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ హీరోగా 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని పవన్ సాధినేని తెరకెక్కిస్తున్నారు. కేసుపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



# చీరకట్టులో మెరిసిన మిథిలా పాల్కర్

మిథిలా పాల్కర్ తన సహజమైన అందం, సింపుల్ యాక్టింగ్ స్టైల్, ఆకట్టుకునే చిరునవ్వుతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటూనే ఉంది. ఎలాంటి ఓవర్ యాక్షన్ లేకుండా సహజంగా నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తొలుత డిజిటల్ కంటెంట్ ద్వారా పాపులర్ అయింది. ఆ తర్వాత వెండితెరపైకి అడుగుపెట్టి పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు చేస్తూ తన నటనా ప్రతిభను చాటుకుంది.మిథిలా పాల్కర్ సినీ ప్రయాణంలో 'కట్టి బట్టి' సినిమా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాతో ఆమె హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మరాఠీ సినిమా 'మురంబా'లో ప్రధాన పాత్రలో నటించి మంచి ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ఆమె చూపించిన సహజమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను నెమ్మదిగా కానీ స్థిరంగా ముందుకు తీసుకెళ్తోంది.ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ మిథిలా పాల్కర్ ఫ్యాషన్ సెన్స్ అభిమానులను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించే తీరు ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా మోటిఫ్ ప్రింట్లతో కూడిన అందమైన చీరను సంప్రదాయ పద్ధతిలో కట్టుకుని, మెడలో ఎత్నిక్ గోల్డ్ జ్యువెలరీ, చెవులకు సంప్రదాయ ఆభరణాలు ధరించి కనిపించింది. జడలో గజ్రా అలంకరణ ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించే ఈ లుక్‌లో మిథిలా పాల్కర్ మరోసారి తన ప్రత్యేకమైన స్టైల్‌తో ఆకట్టుకుంది. సంప్రదాయ అందాన్ని ఆధునిక సొబగులతో మేళవిస్తూ ఆమె చేసిన ఈ ఫ్యాషన్ ఎంపికకు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. కెమెరా ముందు సహజమైన నటనతో మెప్పించే మిథిలా.. కెమెరా వెలుపల కూడా తన సింప్లిసిటీ, సంప్రదాయ ఫ్యాషన్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034